



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెద్నెగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 190 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ గురువారం 02 ఏప్రియల్ 2026 పేజీలు : 12 వెల : 2/-


## జాతీయ రహదారిపై..

# 'మాఫియా' మారణహోమం!









లారీలు ఆపి మరీ నిలువు దోపిడీ.. పగటిపూటే పక్కా స్కెచ్!

తుని నుంచి జగ్గంపేట వరకు 71కి పైగా అక్రమ షాపులతో సిండికేట్ రాజ్యం

అన్నవరం - కత్తిపూడి మధ్య 'సుబ్బారావు' కనుసన్నల్లోనే కోట్లు కొల్లగొడుతున్న దందా

పెట్రోల్ బంకుల్లో నో స్టాక్.. మాఫియా గుప్పిట్లో మాత్రం వేల లీటర్ల డీజిల్ బ్లాక్!

'అంతా ఇచ్చుకునే చేస్తున్నాం.. ఎవరొస్తారో రానివ్వండి' అంటూ బరితెగింపు

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న పోలీస్, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు

కలెక్టర్, ఎస్పీ.. ఈ దోపిడీపై కొరడా ఝుళిపించేది ఎన్నడు?

'విశ్వం వాయిస్' ఎక్స్‌క్లూజివ్ రిపోర్ట్

(విశ్వం వాయిస్ - కాకినాడ జిల్లా ప్రతినిధి):

అభివృద్ధికి పట్టుగొమ్మలుగా నిలవాల్సిన జాతీయ రహదారులు అక్రమార్కులకు అడ్డాగా మారాయి. కాకినాడ జిల్లా పరిధిలోని జాతీయ రహదారి (తుని నుంచి జగ్గంపేట వరకు) ఇప్పుడు పూర్తిస్థాయిలో మాఫియా చేతుల్లో కీలుబొమ్మగా మారింది. రాత్రింబవళ్లు తేడా లేకుండా, లారీలను టార్గెట్ చేస్తూ సాగుతున్న ఈ దోపిడీ పర్వం చూస్తుంటే సామాన్యులు విస్మయానికి గురవుతున్నారు. డీజిల్, ఐరన్, తారు.. ఇలా ఏది పడితే అది! లారీలను ఆపడం, డ్రైవర్లను ప్రలోభపెట్టడమో లేక బెదిరించడమో చేసి అత్యంత తక్కువ ధరకు ఆ సరుకును దింపేసుకోవడం ఈ మాఫియా దినచర్యగా మారింది. నిబంధనలను గాలికొదిలేసి జాతీయ రహదారిపై సాగుతున్న ఈ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేసే నాథుడే కరువయ్యాడు.

**71 అక్రమ దుకాణాలు.. ఒకే సిండికేట్!**

తుని నుంచి జగ్గంపేట వరకు మిగతా .. 2లో..

---

జగన్ మానసిక పరిస్థితి

## సరిగా లేదు

మంత్రి అనగాని సత్యప్రసాద్




**పుట్టపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా అధినేత వైఎస్ జగన్ స్థిరత్వం లేని వ్యక్తి అని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. రాజధాని అమరావతి విషయంలో ఆయన ఒక్కోసారి ఒక్కోమాట మాట్లాడారన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో బుధవారం నిర్వహించిన జిల్లా సమీక్షా మండలి సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ "గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజధానికి కనీసం 30 వేల ఎకరాలు ఉండాలని చెప్పిన జగన్.. అధికారంలోకి రాగానే మాట మార్చారు. మూడు రాజధానులంటూ ఒకసారి, సీఎం ఎక్కడుంటే అక్కడే రాజధాని మిగతా .. 2లో..

---



## శ్రీరాముని ఆశీస్సులతో

# ధర్మపాలన



ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణ మహోత్సవం - పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు

**ఒంటిమిట్ట, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీరాముని ఆశీస్సులతో ధర్మాన్ని అనుసరించి ధర్మపాలన అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాముడు పేరు వినగానే గుర్తొచ్చేది రామరాజ్యం.. సుపరిపాలన అని వ్యాఖ్యానించారు. ఒంటిమిట్ట సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి వారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ముఖ్యమంత్రికి ఆలయ పండితులు స్వామి వార్ల చిత్రపటాన్ని అందించి ప్రసాదాలను అందించారు. అనంతరం జై శ్రీరామ్ నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించారు.

**రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి**

'మనందరికీ ఈ రోజు చాలా పవిత్రమైనది. సీతారాముల వారి కళ్యాణోత్సవంలో పాల్గొనడం మనందరి అదృష్టం. వేంకటేశ్వరస్వామి కూడా మన రాష్ట్రంలోనే కొలువై ఉండటం గొప్పవరం. రాష్ట్రం ఎప్పుడూ సుభిక్షంగా ఉండాలని, రాముడు రామరాజ్యాన్ని మిగతా .. 2లో..

---

అమరావతి ఇక అజేయం..

## అజరామరం

సీఎం చంద్రబాబు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. గత పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయి, అమరావతి భవిష్యత్తుపై ఉన్న మిగతా .. 2లో..

---

ఇంధన ధరలు

## పెంచే ప్రసక్తే లేదు

కేంద్రం



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రం స్పందిస్తూ.. 'ఇంధన ధరలు పెంచే ప్రసక్తే లేద'ని స్పష్టం చేసింది. దేశంలో చమురు నిల్వలు సరిపడా ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. "దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు రెండు నెలలకు సరిపడా ఉన్నాయి. రాబోయే రోజుల్లో కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో అధికంగా కొనాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎల్పీజీ నిల్వలు కూడా మిగతా .. 2లో..

---

నాటో నుంచి

## వైదొలుగుతాం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. నాటో కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నామని అన్నారు. బ్రిటన్‌కు చెందిన 'ది టెలిగ్రాఫ్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆ కూటమి ఓ కాగితపు పులి వంటిదన్నారు. ఈ విషయం రష్యాకూ తెలుసునని చెప్పారు. ఆ కూటమి మాటలకు తానెప్పుడూ ప్రభావితం కాలేదన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు కలిసి రావాలని చేసిన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంపై నాటో దేశాలపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్న మిగతా .. 2లో..

---

ఐఐటి, నీట్ ర్యాంకులే లక్ష్యంగా

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

విద్యాప్రమాణాల మెరుగుదలే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత

ఇంటర్మీడియట్, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఐఐటి, నీట్ ర్యాంకులే లక్ష్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో మంగళవారం ఇంటర్మీడియట్, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్ మెంట్ శాఖల అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ప్రతి రీజియన్ పరిధిలో 4 ఏపీ రెసిడెన్షియల్, 4 కెజిబివిల్లో కోచింగ్ సెంటర్లు ఏర్పాటుచేసి, ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ దాదాపు 70శాతానికిపైగా పూర్తయింది అని, ఈరోజు నుంచి ఇంటర్మీడియట్ అకడమిక్ క్యాలెండరు ప్రారంభమైందని, 6వతేదీ నుంచి ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎట్టి పరిస్థితుల్లో డ్రాపవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచిత టెక్ట్స్ బుక్స్ పంపిణీ 19నాటికి పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.

**అన్నిపాఠశాలలను త్రీస్టార్‌కు చేర్చండి**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది కనీస మౌలిక సదుపాయాలు కల్పించి త్రీస్టార్ రేటింగ్ కు చేర్చాలని మంత్రి ఆదేశించారు. అన్ని స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మనబడి - మన భవిష్యత్తు మిగతా .. 2లో..

---

దేశంలో అతిపెద్ద స్కామ్‌కు

## అమరావతి క్యాపిటల్

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో అతిపెద్ద స్కామ్ అమరావతి క్యాపిటల్ అని చెప్పుకొచ్చారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. అమరావతి ప్రజల రాజధాని కాదు.. కుంభకోణాల రాజధాని అని ఆరోపించారు. అమరావతి టెండర్లలో గూడుపుఠాణీ జరిగింది? మాఫియాగా ఏర్పడ్డారు అని అన్నారు. తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీకి 1100 కోట్లు వృథా చేశారని తెలిపారు. అమరావతికి ఎవరూ మిగతా .. 2లో..

---

మార్కాపురం బస్సు ప్రమాద ఘటన..

## యజమాని, డ్రైవర్ అరెస్టు



**మార్కాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మార్కాపురం బస్సు ప్రమాద ఘటనలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యజమాని హరికృష్ణారెడ్డి, డ్రైవర్ యువరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వేరేవారికి అధిక జీతం ఇవ్వాల్సి వస్తుందని.. అందుకే లైసెన్స్ లేని మిగతా .. 2లో..

---

అమరావతికి చట్టబద్ధతతో..

## బలమైన భవిష్యత్తు

రామ్మోహన్ నాయుడు



**శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడం ఆనందంగా ఉందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రాజధాని కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్కరి శ్రమకు ఫలితం లభించిందని.. వారందరికీ ఈ విజయం అంకితం ఇస్తున్నట్లు తెలిపారు. రాజధాని విషయంలో నెలకొన్న సందిగ్ధతకు తెరదించుతూ.. అవమానాలకు ముగింపు పలుకుతూ.. బలమైన భవిష్యత్తుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తోందన్నారు. "ఈ బిల్లుకు మద్దతు ఇవ్వకుండా వైకాపా ఎంపీలు వాకౌట్ చేయడం.. వారి విధ్వంస వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. సీఎం చంద్రబాబు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### జాతీయ రహదారిపై

## 'మాఫియా' మారణహోమం!

రహదారికి ఇరువైపులా సుమారు 71కి పైగా ఎలాంటి లైసెన్సులు లేని షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇవన్నీ కేవలం ఈ అక్రమ దందా కోసమే ఏర్పాటు చేసినవి కావడం గమనార్హం. జాతీయ రహదారిపై వెళ్లే భారీ రవాణా వాహనాలను ఇక్కడ ఆపి, అత్యంత పకడ్బందీగా ఈ దొంగచాటు వ్యాపారం నిర్వహిస్తున్నారు. లారీల నుంచి కొట్టేసిన సరుకును మళ్లీ బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తూ రాత్రికి రాత్రే లక్షాధికారులు అవుతున్నారు. ఈ అక్రమ షాపుల వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడటమే కాకుండా, పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

**అన్నవరం టు కత్తిపూడి.. 'సుబ్బారావు' కనుసన్నల్లోనే!**

ఈ భారీ దందా వెనుక 'సుబ్బారావు' అనే వ్యక్తి చక్రం తిప్పుతున్నట్లు ప్రధానంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్నవరం నుంచి కత్తిపూడి వరకు సాగుతున్న ఈ అక్రమ సామ్రాజ్యానికి ఆయనే షాడో బాస్ అని స్థానికులు చెవులు కొరుక్కుంటున్నారు. చిన్న చిన్న షాపుల నిర్వాహకులను ఏకం చేసి, ఒక సిండికేట్‌గా మార్చి, అధికారులకు ఎప్పటికప్పుడు 'మామూళ్లు' అందజేస్తూ ఈ దందాను ఎలాంటి ఆటంకాలు లేకుండా నడిపిస్తున్న ఘనత ఇతనిదేనని తెలుస్తోంది. ఈ మాఫియా వెనుక ఇంకెంత మంది పెద్దల హస్తం ఉందో అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**బంకుల్లో డ్రై.. దొంగల చేతిలో ఫుల్!**

ప్రస్తుతం మార్కెట్లో ఇంధన కొరత సామాన్యులను తీవ్రంగా బాధిస్తోంది. పెట్రోల్ బంకుల వద్ద డీజిల్, పెట్రోల్ దొరకక వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతుంటే.. ఈ మాఫియా వద్ద మాత్రం వేల లీటర్ల డీజిల్ నిల్వలు ఉండటం వ్యవస్థ డొల్లతనానికి అద్దం పడుతోంది. లారీల నుంచి కారుచౌకగా కొట్టేసిన డీజిల్‌ను, బారెల్స్‌లో రహస్యంగా నిల్వ చేసి, కృత్రిమ కొరత సృష్టించి మరీ బ్లాక్ మార్కెట్లో అడ్డగోలు ధరలకు అమ్ముకుంటున్నారు. అత్యంత ప్రమాదకరమైన ఈ పేలుడు పదార్థాల నిల్వల వల్ల చుట్టుపక్కల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా ఫైర్, సివిల్ సప్లై అధికారులు కన్నెత్తి చూడకపోవడం దారుణం.

**"మామూళ్లు ఇస్తున్నాం.. మా ఇష్టం"**

ఈ సిండికేట్ సభ్యుల బరితెగింపు ఏ స్థాయిలో ఉందంటే.. "నెలనెలా అందరికీ మామూళ్లు ముట్టజెబుతున్నాం.. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. మా వ్యాపారం ఇంతే" అంటూ బహిరంగంగానే సవాళ్లు విసురుతున్నారు. కళ్లెదుటే కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా, యథేచ్ఛగా దోపిడీ జరుగుతున్నా.. స్థానిక పోలీసులు, హైవే పెట్రోలింగ్, రెవెన్యూ, రవాణా శాఖాధికారులు నింపాదిగా ప్రేక్షకపాత్ర వహించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మామూళ్ల మత్తులో అధికారులు సైతం ఈ దందాకు పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**కలెక్టర్, ఎస్పీ.. ఇకనైనా స్పందించండి!**

జిల్లాలో ఇంతటి భారీ మాఫియా యథేచ్ఛగా రెచ్చిపోతుంటే ఉన్నతాధికారులకు సమాచారం లేదా? లేక కిందిస్థాయి అధికారులు ఉద్దేశపూర్వకంగానే తప్పుదోవ పట్టిస్తున్నారా? ఈ అక్రమ దందాపై జిల్లా కలెక్టర్, ఎస్పీ గారు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ లేదా విజిలెన్స్ బృందాలతో ఆ 71 అక్రమ షాపులపై ముమ్మర దాడులు నిర్వహించి, వాటిని సీజ్ చేయాలి. ప్రధాన సూత్రధారి సుబ్బారావుతో పాటు అతనికి సహకరిస్తున్న అధికారులపైనా ఉన్నతస్థాయి విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మాఫియా ఆటకట్టించి, రహదారిపై దోపిడీని అరికట్టే వరకు ఈ దందాపై నిరంతర పోరాటం కొనసాగుతూనే ఉంటుంది!

## జగన్ మానసిక పరిస్థితి సరిగా లేదు

అని మరోసారి వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయాక నాగార్జున యూనివర్సిటీలో పెడితే సరిపోతుందన్నారు. జగన్ మానసిక పరిస్థితి సరిగా లేదు. ఇలాంటి పిచ్చి ఆలోచనలు చేయడం వల్లే 11 సీట్లకు పరిమితమయ్యారు. ఓట్లు వేయలేదని ప్రజలపై కక్ష తీర్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదు. చంద్రబాబు మీద నమ్మకంతో భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ఫ్రీహోల్డ్ భూముల సమస్యకు పరిష్కారం చూపుతాం. 22ఏ భూములపైనా త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, సింధూరరెడ్డి, ఎంఎస్‌రాజు, ధర్మవరం తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు.

## నాటో నుంచి వైదొలుగుతాం

ట్రంప్.. వాళ్లు పిరికివాళ్లంటూ ఇటీవల విమర్శించిన విషయం తెలిసిందే. రష్యాతో నాలుగేళ్లుగా ఉక్రెయిన్ చేస్తున్న యుద్ధానికి తాము మద్దతుగా నిలిచినప్పటికీ.. ఇరాన్ విషయంలో నాటో మిత్రదేశాలు అమెరికాకు తోడుగా రావడం లేదని ట్రంప్ అభిప్రాయపడ్డారు. దీన్ని తాను ఊహించలేదన్నారు. ఉక్రెయిన్‌తో తమకు సంబంధం లేకున్నా.. వారికి అండగా నిలిచామన్నారు. అయినప్పటికీ వాళ్లు తమతో కలిసి రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ట్రంప్ ఇటువంటి బెదిరింపులు చేయడం ఇదే తొలిసారి కాదు. 2018లో అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. సభ్య దేశాలు రక్షణ బడ్జెట్‌ను ఆశించిన మేర ఖర్చు పెట్టకపోతే నాటో నుంచి బయటకు వెళ్లిపోతామని అన్నారు. ప్రతి సభ్య దేశం తన జీడీపీలో కనీసం రెండు శాతం రక్షణపై ఖర్చు చేయాలని సభ్య దేశాలు గతంలో నిర్ణయించాయి.

## ఇంధన ధరలు పెంచే ప్రసక్తే లేదు

సరిపడా ఉన్నాయి. ఒక వేళ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే తీసుకోవాల్సిన చర్యలపై కేంద్రం యోచిస్తోంది. రిఫైనరీలు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. రెండు నెలల క్రితం బ్యారెల్‌కు 70 డాలర్ల దగ్గర ట్రేడ్ అయిన బ్రెంట్ క్రూడ్, ఈ రోజు 100 డాలర్ల మార్కును దాటింది. 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు డీజిల్, పెట్రోలు ధరలను పెంచలేదు. వినియోగదారులపై భారం తగ్గించేందుకు ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాం" అని పేర్కొన్నారు.

## అమరావతికి చట్టబద్ధతతో.. బలమైన భవిష్యత్తు

ప్రపంచస్థాయి నగరాన్ని నిర్మిస్తూ ఉంటే.. అమరావతిని ఓ స్కామ్‌గా జగన్ పేర్కొనడం ఆయన అజ్ఞానాన్ని, రైతులపై ఉన్న అసూయను చాటుతోంది. ఎవరెన్ని ఆరోపణలు చేసినా.. నిజాలు తెలిసిన ప్రజలు.. కూటమితో కలిసి అభివృద్ధి వైపు నడవడానికే మొగ్గు చూపుతున్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు ధన్యవాదాలు" అని తెలిపారు.

### ఐఐటి, నీట్ ర్యాంకులే లక్ష్యంగా

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

కింద రూ.2,034 కోట్లు సమీకరించాలని సూచించారు. ఇప్పటికే రూ.770కోట్లతో వివిధ పనులు పురోగతిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉపాధ్యాయులంతా లెర్నింగ్ అవుట్ కమ్స్, విద్యార్థుల ప్రవేశాలపై దృష్టి సారించాలని, విద్యాప్రమాణాల మెరుగుదలే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగా మంత్రి పేర్కొన్నారు. పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది వయోజన విద్యలో గణనీయమైన పురోగతి సాధించడం, అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుచేయడంపై మంత్రి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విద్యా సంవత్సరంలో 24,74,638మంది వయోజన విద్యాశాఖ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. దీంతో గతఏడాది 73శాతంగా ఉన్న అక్షరాస్యత శాతం 83శాతానికి పెరిగినట్లు చెప్పారు. వచ్చేఏడాది నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు.

**స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 1.95లక్షల మందికి ఉద్యోగాలు**

స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా ఇప్పటివరకు 1,95,078మందికి ఉద్యోగాలు కల్పించినట్లు ఆ శాఖ డైరక్టర్ గణేష్ కుమార్ మంత్రి లోకేష్ కు తెలిపారు. ఇప్పటివరకు తమ శాఖ ద్వారా 6.87లక్షలమందికి నైపుణ్య శిక్షణ అందించామని, ప్రస్తుతం 71,193మంది శిక్షణలో ఉన్నట్లు చెప్పారు. 26రంగాల పూర్తిస్థాయి సమాచారంతో నైపుణ్యం పోర్టల్ సిద్ధమైనట్లు చెప్పారు. నిర్మాణరంగంలో జాబ్స్ కు సంబంధించి ఈనెల 3వవారంలో 50 జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో అమరావతిలో వర్క్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సిద్ధంగా ఉన్న 87వేలమంది నిర్మాణ కార్మికులకు జాయింట్ సర్టిఫికేషన్, ప్లేస్ మెంట్ పై వర్క్ షాపులో ఎంఓయులు కుదుర్చుంటామని చెప్పారు. అమరావతిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ ఆధ్వర్యాన నిర్మించతలపెట్టిన అమరావతి కన్ స్ట్రక్షన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు సంబంధించిన ప్లాన్లను అధికారులు ప్రదర్శించారు. ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే పనిచేస్తున్న సిఓఇలను అధ్యయనం చేయాలని మంత్రి లోకేష్ సూచించారు. మంగళగిరిలో ఏడాదికి 18వేలమందికి శిక్షణ ఇచ్చే స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. టెక్నాలజీ, హెల్త్ కేర్, మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీసెస్ రంగాల్లో ఇక్కడ నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలు, డేటా ఆర్కిటెక్చర్ ట్రాన్సఫర్మేషన్, సింగిల్ ఎంట్రీ పాయింట్ ద్వారా సమాచారాన్ని క్రోడికరించే లీప్ హయ్యర్ ఎడ్యుకేషన్ యాప్ రూపకల్పనపై ఉన్నతవిద్య శాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షించారు. కళాశాలల్లో ముఖ ఆధారిత హాజరును కఠినంగా అమలుచేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో కొత్త కోర్సుల అనుమతులను సరళతరం చేసే అంశంపై చర్చించారు. ఈ సమావేశంలో మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నతవిద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్త, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరక్టర్ రంజిత్ బాషా, స్కిల్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ గణేష్ కుమార్ పాల్గొన్నారు.

### మార్కాపురం బస్సు ప్రమాద ఘటన..

## యజమాని, డ్రైవర్ అరెస్టు

యువరాజ్‌ను ట్రావెల్స్ యాజమాన్యం డ్రైవర్‌గా పెట్టుకున్నట్లు డీఎస్పీ నాగరాజు మీడియా సమావేశంలో వెల్లడించారు. "ఎనిమిది నెలల క్రితం సెకండ్ హ్యాండ్ బస్సును హరికృష్ణారెడ్డి కొనుగోలు చేశారు. బస్సు కండిషన్ సరిగా లేదని తెలిసినా నడిపిస్తున్నారు. ఈ బస్సు వినుకొండ మీదుగా గమ్యస్థానానికి వెళ్లాల్సి ఉంది. ప్రయాణంలో తరచూ రిపేరు వస్తుండటంతో జాతీయ రహదారి మీదుగా మార్కాపురం వైపు మళ్లించారు" అని డీఎస్పీ వెల్లడించారు. తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కలిగిరికి వెళ్తున్న హరికృష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. గత నెల 26న రాయవరం వద్ద టిప్పర్‌ను ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో 14 మంది సజీవ దహనం కాగా.. మరో 29 మందికి గాయాలయ్యాయి.

### దేశంలో అతిపెద్ద స్కామ్‌కు

## అమరావతి క్యాపిటల్

వ్యతిరేకం కాదు అంటూ క్లారిటీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తాడేపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ..'అమరావతిలో భయంకరమైన అవినీతి, దోపిడీ జరుగుతోంది. దేశంలో అతిపెద్ద స్కామ్‌కు అమరావతి క్యాపిటల్. అమరావతి ప్రజల క్యాపిటల్ కాదు.. స్కామ్‌ల రాజధాని. అమరావతి టెండర్లలో గూడుపుఠాణీ జరిగింది? మాఫియాగా ఏర్పడ్డారు. 2018లో ఏ పనులు, ఎవరు చేశారో, 2024లో టెండర్లు రద్దు చేసిన తర్వాత కూడా మళ్లీ అవే కంపెనీలకు పనులు దక్కాయి. ఒకవైపున అనూహ్యంగా రేట్లు పెంచి, మరో వైపున టెండర్లు రిగ్ చేశారు. ల్యాండు ఫ్రీ, ఇసుక ఫ్రీ, కరెంటు ఛార్జీల్లో రాయితీలు, జీఎస్టీ మినహాయింపు, సీనరేజీ మినహాయింపు, ఎన్ఏసీ మినహాయింపు ఇస్తున్నారు. ఇవన్నీ ఉన్నాసరే ఎస్ఎఫ్‌టీ చదరపు అడుగుకు రూ.11వేల నుంచి రూ.14వేలు చూపిస్తున్నారు. ప్రజల రాజధాని సంగతి దేవుడెరుగు అతిపెద్ద స్కాంకు, కరప్షన్‌కు చంద్రబాబు నిజంగానే క్యాపిటల్ చేసేశాడు. బెంగళూరు, హైదరాబాద్‌లాంటి మహా నగరాల్లో ఫైవ్ స్టార్ సదుపాయాలతో చదరపు అడుగుకు రూ.4,500 దాటదు. కానీ, అమరావతిలో టవర్-1కు 2018లో టెండర్ విలువ రూ.932 కోట్లు. కాంట్రాక్టర్‌కు అన్ని మినహాయింపులు ఇచ్చి టెండర్ పెంచారు. మొత్తం కాంట్రాక్ట్ విలువ 1762 కోట్లకు పెంచారు. టవర్-2కు 2018లో టెండర్ విలువ 762 కోట్లు. ఇప్పుడు అన్ని మినహాయింపులు ఇచ్చి 1545 కోట్లకు పెంచారు. జీఏడీ టవర్.. 2018లో కాంట్రాక్ట్ విలువ 554 కోట్లు. ఇప్పుడు జీఏడీ టవర్ పనులను రూ.1046 కోట్లకు పెంచేశారు. ఐదు టవర్లకు చదరపు అడుగుకు రూ.14795 ఖర్చు చేస్తున్నారు. తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీకి 1100 కోట్లు వృథా చేశారు. తెలంగాణ సచివాలయాన్ని కేసీఆర్ రూ.615 కోట్లతో కట్టారు. ఢిల్లీలో పార్లమెంట్ కొత్త భవనం రూ.970 కోట్లతో కట్టారు. మళ్లీ అసెంబ్లీ అంటూ రూ.1149 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మళ్లీ హైకోర్టు అంటూ రూ.1480 కోట్లు ఖర్చు చేస్తున్నారు. స్కామ్‌ల కోసం హైకోర్టు, అసెంబ్లీలను కూడా వదలడం లేదు. అసెంబ్లీ డిజైన్ల కోసం రూ.401 కోట్లు ఖర్చు చేశారు. మురుగు కాల్వల నుంచి వరదల వరకు ప్రతీచోటా బాబు అవినీతి జరిగింది. కొండవీటి వాగు-వారధి వరకు ఫ్లైఓవర్‌కు కిలోమీటర్‌కి 170 కోట్లా?. మా హయాంలో ఫ్లైఓవర్ల కోసం కిలోమీటరకి రూ.35 కోట్లు ఖర్చు చేశాం. అమరావతిలో కి.మీకి 53 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అమరావతికి ఎవరూ వ్యతిరేకం కాదు' అని అన్నారు.

## శ్రీరాముని ఆశీస్సులతో ధర్మపాలన

అందించినట్లుగానే కూటమి పాలన సాగేలా ఆశీర్వదించాలని ఆకాంక్షిస్తున్నా. ప్రజలకు సందప, ఆరోగ్యం, ఆనందం ఇవ్వాలని శ్రీరాముణ్ని ప్రార్థించా. సమైక్య రాష్ట్రంలో భద్రాచలంలో శ్రీరామనవమి జరుపుకునేవాళ్లం. విభజన తర్వాత ఒంటిమిట్టను టీటీడీలో విలీనం చేసి ఏటా ఘనంగా బ్రహ్మోత్సవాలు జరుపుకుంటున్నాం. ఈ రోజు లోక్‌సభలో అమరావతి రాజధానిగా ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. నాడు అమరావతి రాజధానిగా దేవేంద్రుడు పాలిస్తే... నేడు ప్రజారాజధానిగా అమరావతి ఉంది. రాముడు రామరాజ్యాన్ని ఇచ్చినట్లుగానే రాముడి ఆశీస్సులతో ధర్మాన్ని పాటించి మీకు అండగా ఉంటాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

## అమరావతి ఇక అజేయం.. అజరామరం

సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని సీఎం పేర్కొన్నారు. "రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇది. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయి. అమరావతి ఇక అజేయం.. అజరామరం. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతాం. సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు హృదయపూర్వక ధన్యవాదాలు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకూ ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు" అని సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

## మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలి

**రాష్ట్రవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులకు క్లిక్కర్ విధానం అమలు చేయాలి**
**లీప్ యాప్ వినియోగం పట్ల తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావాలి - సమగ్రశిక్ష అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష**

**ఉండవల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో సమగ్రశిక్ష అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇరాన్ యుద్ధం కారణంగా పెట్రోలియం ఆధారిత ఉత్పత్తుల లభ్యత తగ్గడంతో స్టూడెంట్ కిట్ లపై ప్రభావంపై ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. విద్యార్థి మిత్ర కిట్ నాణ్యత విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్లిక్కర్ ఆధారిత పునశ్చరణ విధానం పట్ల తల్లిదండ్రుల్లో సానుకూలత ఉందని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా మొదట తొమ్మిదో తరగతి విద్యార్థులకు క్లిక్కర్ ఆధారిత అభ్యసన విధానాన్ని అమలుచేయాలని ఆదేశించారు. తదనంతరం ఇతర తరగతుల్లో క్లిక్కర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. లీప్ యాప్ లో విద్యార్థులకు ఉపయోగపడే పాఠ్యాంశాల వీడియోలు ఎన్ని చేశారో మంత్రి ఆరా తీశారు.

**మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలి**

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో సోమవారం నుంచి లీప్ యాప్ ద్వారా టీచర్, పేరెంట్ ఫీడ్ బ్యాక్ ను సేకరిస్తున్నట్లు అధికారులు వివరించారు. మంగళవారం వరకు 6,719 పాఠశాలల నుంచి అభిప్రాయ సేకరణ చేసినట్లు తెలిపారు. ఫీడ్ బ్యాక్ ప్రక్రియను ఆటోమేషన్ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లీప్ యాప్ ను ఎంతమంది తల్లిదండ్రులు వినియోగిస్తున్నారని మంత్రి ఆరా తీశారు. లీప్ యాప్ వినియోగం పట్ల తల్లిదండ్రుల్లో అవగాహనకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. అభ్యసన ఫలితాల మెరుగుదలలో స్కూల్ మేనేజ్




మెంట్ కమిటీలు సమర్థవంతమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మంత్రి అభిప్రాయపడ్డారు. ఆర్టీఈ, ఆటిజం సపోర్ట్ సెంటర్స్ అంశాలపైనా సమావేశంలో చర్చించారు. ఫేజ్-1 కింద చినకాకాని, బాపట్లలో నిర్మాణం పూర్తైన ఆటిజం సపోర్ట్ సెంటర్స్ ప్రారంభానికి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఫేజ్-2 కింద 28 ఆటిజం సెంటర్స్ ఈ ఏడాది జూన్ నాటికి, 95 సెంటర్స్ ఈ ఏడాది నవంబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికారులు వివరించారు. ఆటిజం సపోర్ట్ సెంటర్స్ నిర్వహణకు సంబంధించి నిష్ణాతులైన మానసిక వైద్యులు, కౌన్సిలర్ల శిక్షణకు నిమ్ హాన్స్ (చీ×వీనాచీూ) వంటి సంస్థల సహకారం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కేజీబీవీ అడ్మిషన్స్ స్టేటస్, 1095 బోధనేతర, 277 బోధన సిబ్బంది నియాకంపైనా సమావేశంలో చర్చించారు. ప్రజాప్రభుత్వం అమరావతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న స్టేట్ సెంట్రల్ లైబ్రరీపైనా మంత్రి సమీక్షించారు. భవన తుది నమూనాను ఆమోదించారు. త్వరితగతిన పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని, 2028 నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య డైరెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ సీఎస్ దీవన్ రెడ్డి, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### పులి సంచరిస్తోందని తెలియక..

## చిక్కుకున్న 50 మంది సందర్శకులు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవీపట్నం మండలం రామదుర్గం కొండల్లో పెద్ద పులి సంచారం కలకలం రేపుతోంది. ఈ విషయం తెలియక.. రాజానగరం మండలానికి చెందిన సుమారు 50 మంది సందర్శకులు ఆ ప్రాంతంలో విహారయాత్రకు వెళ్లారు. అక్కడ పులి సంచారంతో సందర్శకులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఈ విషయంపై ఎంపీ పురందేశ్వరి కార్యాలయ సిబ్బంది.. వెంటనే జిల్లా కలెక్టర్, డీఎఫ్‌వోకు సమాచారం అందించారు. దీంతో సందర్శకులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు అటవీశాఖ బృందాలు రంగంలోకి దిగాయి. గత 5 రోజులుగా దేవీపట్నం మండలం గోదావరి తీరంలోనే పులి తిరుగుతోంది. దీనిపై ఎప్పటికప్పుడు అటవీ శాఖ అధికారులు సమాచారం అందిస్తున్నారు. అయితే, ఈ విషయం తెలుసుకోకుండా సందర్శకులు రామదుర్గం కొండకు వెళ్లి చిక్కుకుపోయారు.

## అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభ ఆమోదం



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది.

# ఎడిటర్ వాయిస్

## బస్సు యాక్సిండెంట్లు తగ్గించేందుకు సూపర్ ప్లాన్.. ఇక డ్రైవర్‌ను నిత్యం మానిటరింగ్ చేసే మిషన్ రెడీ..

బస్సు డ్రైవర్లకు చిన్న కునుకు వచ్చిందంటే చాలు.. 60 మంది ప్రాణాలు వణకాల్సిందే.. డ్రైవర్ అజాగ్రతతో ఎనోన్నో ప్రమాదాలు జరిగినట్లు చరిత్ర చెప్తోంది. చాలా మంది ప్రయాణికులు ఈ ప్రమాదాల్లో మరనించారు. రాత్రిపూట ప్రయాణించేటప్పుడు బస్సు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకుంటే ఏం జరుగుతుందో అన్న భయం ప్రతి ప్రయాణికుడిలోనూ కలుగుతుంది. కానీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ తీసుకున్న నిర్ణయం పెద్ద ఊరటనిస్తోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డ్యాష్‌క్యామ్‌లను బస్సుల్లో ఏర్పాటు చేయడం ద్వారా డ్రైవర్ చిన్నగా కునుకు తీసినా లేదంటే ఆవలించినా వెంటనే పసిగట్టి అప్రమత్తం చేసే సరికొత్త వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది.

**నిరంతర నిఘా!**

బస్సుల్లో ఏర్పాటు చేస్తున్న ఈ ఏఐ కెమెరాలు కేవలం రికార్డింగ్ కోసమే కాదు.., అవి డ్రైవర్ ప్రవర్తనను నిశితంగా గమనిస్తాయి. డ్రైవర్ కళ్లు మూతపడినా.., ఆవలిస్తున్నా.. ఈ కెమెరాలు వెంటనే పసిగడతాయి. ఐదు సెకన్లకు ఒకసారి సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు పంపుతూ, డ్రైవర్‌తో పాటు యజమానిని కూడా అలెర్ట్ చేస్తాయి. డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ బస్సు నడిపినా లేదా సిగరెట్ తాగుతున్నా ఈ వ్యవస్థ ఊరుకోదు. వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం చేరవేస్తుంది. నిర్దేశించిన వేగం కంటే ఎక్కువ వేగంతో వెళ్తే వెంటనే అప్రమత్తం చేయడమే కాకుండా, ఆటోమేటిక్‌గా చలానా కూడా జారీ చేస్తుంది.

**ప్రమాదాల విశ్లేషణ**

ఈ వ్యవస్థ ద్వారా ప్రమాదం జరిగినప్పుడు బాధ్యులెవరో తేల్చడం సులభం అవుతుంది. బస్సు లోపల డ్రైవర్ వద్ద, ప్రయాణికుల వైపు, డోర్ వద్ద, ముందు రోడ్డు వైపు కెమెరాలు ఉంటాయి. ప్రమాదం సంభవిస్తే రోడ్డు మార్జిన్స్, ముందున్న వాహనాల వివరాలు అన్నీ రికార్డ్ అవుతాయి కాబట్టి, తప్పు ఎవరిదో స్పష్టంగా తెలుస్తుంది. దీనివల్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు, చట్టపరమైన చర్యలు వేగవంతం అవుతాయి.

**2 వేల బస్సుల్లో ఏర్పాటు చేయడమే లక్ష్యం!**

ఈ అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి అయ్యే ఖర్చును ట్రావెల్స్ యాజమాన్యాలే భరించేందుకు ముందుకు రావడం విశేషం. ఒక్కో బస్సులో ఈ వ్యవస్థ ఏర్పాటుకు రూ. 12,000 అవుతుంది, నెలకు నిర్వహణ ఖర్చు రూ. 750. ఇప్పటికే 391 బస్సుల్లో ఈ డివైజ్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తిరిగే మొత్తం 2 వేల ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో దీనిని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి రాంప్రసాద్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ఏపీకి తిరిగి రానున్న బస్సులు!**

ట్రావెల్స్ బస్సుల రీ-రిజిస్ట్రేషన్ అంశంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఏపీలో సీటుకు త్రైమాసికానికి రూ. 4 వేల పన్ను ఉండడంతో, చాలా మంది అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ వంటి రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఈ పన్నును రూ. 2,500 కు తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. బుధవారం (ఏప్రిల్ 1) జరిగే సమావేశంలో దీనిపై స్పష్టత వస్తే, ఇతర రాష్ట్రాల్లో ఉన్న బస్సులు మళ్లీ ఏపీకి వచ్చి రీ-రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. ఇది రాష్ట్ర ఆదాయాన్ని కూడా పెంచుతుంది. సాంకేతికతను సామాన్యుల భద్రత కోసం వాడుకోవడం అభినందనీయమనే చెప్పాలి. కునుకు తీసినా పట్టేసే ఈ ఏఐ వ్యవస్థ వల్ల డ్రైవర్లలో బాధ్యత పెరగడమే కాకుండా, వేలాది మంది ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ లభిస్తుంది. పన్ను తగ్గింపు ద్వారా యాజమాన్యాలకు ఊరటనిస్తూనే, భద్రతా ప్రమాణాలు పాటించేలా చేయడం రవాణా శాఖ తీసుకున్న ఒక సమతుల్య నిర్ణయం.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## నారాయణపేట జిల్లాలో చిన్నారి అనుమానాస్పద మృతి

**నారాయణపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నారాయణపేట జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. నారాయణపేట మండలంలోని ఓ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారి అనుమానాస్పదరీతిలో మృతిచెందింది. గుర్తుతెలియని వ్యక్తులు చిన్నారిని చంపినట్లు స్థానికులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి భోజనం అనంతరం అవ్వ, తాతలతో కలిసి ఇంటి బయట నిద్రిస్తున్న చిన్నారిని ఎత్తుకెళ్లి హత్య చేశారని.. అనంతరం మృతదేహాన్ని చెరువుకట్టపై పడేసి వెళ్లారని చెప్పారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. అదే సమయంలో పొలం నుంచి గ్రామానికి వస్తున్న ఇద్దరు వ్యక్తులు చిన్నారి మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనాస్థలికి అవ్వ, తాతలు చేరుకుని.. మనవరాలు విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించి బోరున విలపించారు. ఈ ఘటనపై డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు.

## మత్తులో మునిగి.. మృగంలా మారి

### భార్యాపిల్లలపై రోకలితో భర్త దాడి - తల్లి, కుమారుడి మృతి... కుమార్తె పరిస్థితి విషమం



**ఆమనగల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. జీవితాంతం తోడుంటానని బాస చేశాడు. కుటుంబాన్ని బాధ్యతగా చూసుకోవాల్సిన అతను తాగుడుకు బానిసయ్యాడు. మద్యం మత్తులో రోకలి బండతో దాడి చేయగా భార్య, కుమారుడు అక్కడికక్కడే మృతిచెందగా.. ఓ కుమార్తె ఆసుపత్రిలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం సీతారాంనగర్ తండా పంచాయతీ పరిధిలోని పులిగోనిపల్లితండాలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం... స్థానికుడైన బాణావత్ రాందాస్‌నాయక్.. అదే మండలం రాంనుంతల చిన్నతండాకు చెందిన కవిత(28) ఆమనగల్లులోని ఓ కాటన్ మిల్లులో పనిచేస్తుండగా ప్రేమించుకున్నారు. 2010లో వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొద్దిరోజుల కిందట ఇద్దరూ మిల్లులో ఉద్యోగం మానేశారు. రాందాస్‌నాయక్ మద్యానికి బానిసై రోజూ తాగుతూ జులాయిగా తిరుగుతుండగా కవిత కూలి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తున్నారు. పెద్దకుమార్తె పవిత్ర ఇంటివద్దనే ఉంటోంది. రెండో కుమార్తె పావని హాస్టల్‌లో ఉంటూ 6వ తరగతి చదువుతోంది. మూడో కుమార్తె ప్రణీత(9) 4వ తరగతి, కుమారుడు హర్షవర్ధన్(7) ఒకటో తరగతి చదువుతున్నారు. సోమవారం రాత్రి రాందాస్‌నాయక్ మద్యం తాగి కవితతో గొడవపడ్డాడు. భయపడిన పవిత్ర బంధువుల ఇంటికి వెళ్లింది. రాందాస్‌నాయక్, కవిత, ప్రణీత, హర్షవర్ధన్ తమ ఇంట్లోనే నిద్రించారు. మద్యం మత్తులో ఉన్న రాందాస్‌నాయక్ మంగళవారం తెల్లవారుజామున... నిద్రిస్తున్న భార్య కవిత, కుమార్తె ప్రణీత, కుమారుడు హర్షవర్ధన్‌ను రోకలి బండతో చితకబాదాడు. కవిత, హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతిచెందగా.. ప్రణీత కొనఊపిరితో ఉంది. స్థానికుల సమాచారంతో సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ప్రణీతను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. రాందాస్‌నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ జానకిరెడ్డి పరిశీలించారు. 2023లో రాందాస్‌నాయక్‌పై వేధింపుల కేసు నమోదవగా లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకున్నారు. విషయం తెలిసి హాస్టల్ నుంచి తిరిగొచ్చిన రెండో కుమార్తె పావని గుండెలవిసేలా రోదించింది. 'మా అక్కను, నన్ను కూడా చంపేస్తాడు. మా నాన్నను ఉరితీయండి' అంటూ పోలీసులకు విన్నవించింది. ఆ చిన్నారి రోదన అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

## అమానవీయ ఘటన.. దొంగతనం చేశాడని ఉద్యోగికి చిత్రహింసలు

### కర్రలతో చితకబాది, గాయాలపై పచ్చికారం పెట్టిన యజమాని



**మచిలీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** దొంగతనం చేశాడనే ఆరోపణపై తన దగ్గర పనిచేసే ఉద్యోగిని కర్రలతో చితకబాది కమిలిన చోట్ల, ప్రైవేట్ భాగాలపై పచ్చిమిర్చి, వెల్లుల్లి నూరిన మిశ్రమాన్ని పెట్టి చిత్రహింసలు పెట్టాడో యజమాని. ఈ అమానవీయ ఘటన మచిలీపట్నంలోని పోతేపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు పరిమి రవికుమార్ తనను యజమాని చిత్రహింసలకు గురిచేసిన తీరును చెప్పుకొచ్చారిలా.. 'పోతేపల్లి జ్యుయలరీ పార్క్‌లోని ఉషా గోల్డ్ పరిశ్రమలో నేను ఏడాది నుంచి మేనేజర్‌గా పని చేస్తున్నాను. షాపులో రోల్డ్‌గోల్డ్ తయారీకి ఉపయోగించే పరికరాలు దొంగతనానికి గురయ్యాయని యజమాని తోట రామసురేష్ నన్ను నిలదీశాడు. నాకు దొంగతనంతో సంబంధం లేదని బదులిచ్చినా యజమాని నమ్మలేదు. ఉదయం 11.30 గంటల సమయంలో మరో ముగ్గురు ఉద్యోగులు గిల్లి రమేష్, మోను, కునాల్‌తో కలిసి యజమాని నాపై కర్రలతో దాడి చేశారు. అనంతరం పచ్చిమిర్చి, వెల్లుల్లి నూరి వాటి మిశ్రమాన్ని కమిలిన గాయాలతో పాటు ప్రైవేట్ భాగాలపై పెట్టారు. రూ.20 వేల విలువ చేసే పరికరాలు పోయాయని, సాయంత్రం లోపు రూ.2 లక్షలు చెల్లిస్తే కానీ ఇంటికి పోవంటూ బెదిరించారు' అని వివరించారు. రోజూ మధ్యాహ్న భోజన సమయంలో భార్య రజినీకుమారి భర్త రవికుమార్‌కు ఫోన్ చేసేవారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఫోన్ చేయగా భర్త ఫోన్ స్విచాఫ్ వచ్చింది. దాంతో కంపెనీలోని ఇతర వ్యక్తులకు ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదు. దీంతో సోదరుడితో కలిసి కంపెనీ వద్దకు వెళ్లగా భర్తను నిర్బంధించడాన్ని ఆమె గమనించింది. కొద్దిసేపటి తర్వాత రవికుమార్‌ను వదిలిపెట్టడంతో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

## అమ్మ రాసిన మరణశాసనం

### కన్నబిడ్డలకు ఉరేసి.. తానూ బలవన్మరణం



**మూసాపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రెండోపెళ్లి చేసుకున్న భర్త పెట్టే బాధలు భరించలేకపోయిందో.. కన్నబిడ్డలకూ కష్టాలు తప్పవని భావించిందో.. ఆ తల్లి కఠిన నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లలకు ఉరేసి.. తానూ బలవన్మరణానికి పాల్పడింది. హైదరాబాద్ కూకట్‌పల్లి ఠాణా పరిధిలో ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఎల్లయ్యగూడెంలోని బోడమాణిక్యం తండాకు చెందిన బోడ ప్రవీణ్, పదహార్ చింతల్ తండాకు చెందిన స్రవంతి(30)ని గతంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరు హైదరాబాద్ మూసాపేట సమీపంలోని రాఘవేంద్ర సొసైటీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కార్తిక్(12), కౌశిక్(10). ప్రవీణ్ భవన నిర్మాణ రంగంతోపాటు కారు డ్రైవర్‌గానూ పనిచేస్తున్నాడు. స్రవంతి ఇళ్లలో పనిచేస్తుండేది. ఏడాది క్రితం ఆమెకు సోదరి వరసయ్యే మహేశ్వరి ఎలియాస్ సోనీని ప్రవీణ్ రెండో వివాహం చేసుకుని వేరేచోట ఉంచాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలై తీవ్రమయ్యాయి. అతను నిత్యం మద్యం తాగొచ్చి భార్యను వేధించేవాడు. చాలాసార్లు చెయ్యి చేసుకోవడంతో స్థానికులు సర్దిచెప్పారు. ఈ క్రమంలో ఆదివారం నర్సంపేటలో స్రవంతి పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టింది. ఇకనుంచి బాగా చూసుకుంటానని ప్రవీణ్ చెప్పడంతో దంపతులు సోమవారం రాత్రి రాఘవేంద్ర సొసైటీలోని ఇంటికి తిరిగివచ్చారు. ప్రవీణ్ మంగళవారం ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్న భోజనానికి ఇంటికి వచ్చాడు. తలుపులకు గడియపెట్టి ఉండగా.. ఎంత పిలిచినా భార్య బదులివ్వలేదు. స్థానికుల సాయంతో తలుపులు బద్దలుగొట్టి లోపలికి వెళ్లగా.. అప్పటికే స్రవంతితోపాటు కార్తిక్, కౌశిక్‌లు ఇంటి పైకప్పునకు వేలాడుతూ కనిపించారు. దీంతో వారి మృతికి ప్రవీణే కారణమంటూ వరంగల్ జిల్లా బోడమాణిక్యం తండాలోని అతని ఇంటిపై స్రవంతి బంధువులు దాడిచేసి నిప్పంటించారు. వారిని ప్రవీణే హత్యచేశాడని ఆరోపించారు. కార్తిక్ కొంపల్లిలోని ఓ వసతిగృహంలో ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడు. రెండో కుమారుడు మూసాపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి దంపతుల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఆ క్రమంలో స్రవంతిని భర్త ఇష్టమొచ్చినట్లు కొట్టాడని ఇరుగుపొరుగువారు చెబుతున్నారు. దీంతో మానసికంగా కుంగిపోయిన స్రవంతి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు భావిస్తున్నారు. మంగళవారం ఉదయం కార్తిక్ తన మేనమామ సెల్‌ఫోన్‌కు 'నాన్న.. రాత్రి అమ్మను కొట్టి... తాతమ్మతో సెల్‌ఫోన్‌లో మాట్లాడాడు' అని వాట్సప్‌లో మెసేజ్ పంపించాడు. ప్రవీణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని.. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని బాలానగర్ జోన్ ఏసీపీ నరేష్, కూకట్‌పల్లి సీఐ కె.వెంకటసుబ్బారావు పరిశీలించారు.

## పచ్చని కాపురంలో మద్యం చిచ్చు

### రైలుకింద పడిన వివాహిత దుర్మరణం.. కుమారుడి పరిస్థితి విషమం

**నరసన్నపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పచ్చని కాపురంలో మద్యం చిచ్చు రేపింది. దంపతుల మధ్య చోటుచేసుకున్న వివాదంలో మనస్తాపానికి గురైన ఇల్లాలు ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కింద పడింది. ఆమె ప్రాణాలు కోల్పోగా చిన్న కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరుకు చెందిన కె.రమణ ఒప్పంద ప్రాతిపదికన కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తూ గూనపాలెంలో నివాసం ఉంటున్నారు. ఆయనకు 14 ఏళ్ల కిందట నరసన్నపేట మండలం కంబకాయకు చెందిన జ్యోతి (37)తో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు హేమంత్ (13), పునీత్ (11) ఉన్నారు. రమణ సోమవారం మద్యం తాగి రావడంతో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. మంగళవారం ఉదయం రమణ విధులకు వెళ్లిన తర్వాత జ్యోతి, ఇద్దరు కుమారులతో కలిసి కంబకాయ చేరుకున్నారు. గ్రామానికి దగ్గర్లో తిలారు రైల్ నిలయం- కంబకాయ మధ్య పిల్లలతో పాటు రైలు కింద పడ్డారు. ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. హేమంత్ రెండు కాళ్లూ దెబ్బతిన్నాయి. పునీత్ కుడి కాలు తెగిపడగా.. తలకు బలమైన గాయాలయ్యాయి. పోలీసులు వారిని ఆసుపత్రికి తరలించారు. పునీత్ పరిస్థితి విషమంగా ఉంది.

## ఆమె నడిపిస్తోంది..





ఏదైనా పని చేయాలనుకున్నప్పుడు ఫలితం ఎలా ఉన్నా... ప్రయత్నం బాగుంటే అదో పాఠం అవుతుందని భావిస్తారు కొందరు. రాధిక బెహరా ఈ కోవకు చెందిన వారే. 'ఫెమీ రైడ్స్' ద్వారా రవాణా రంగంలో విప్లవాత్మక మార్పుకోసం ఐదేళ్లుగా ప్రయత్నిస్తున్నారీమె. చిన్నప్పట్నుంచీ సవాళ్లంటే ఇష్టం ఆమెకు. సొంతంగా ఏదైనా చేయాలి... తల్లిదండ్రులకు చేయూతగా ఉండాలని కోరుకునేవారు. కానీ చిన్నవయసులోనే పెళ్లి... ఇద్దరు పిల్లలు. పదేళ్లు ఇంటి బాధ్యతలతోనే గడిచిపోయింది. భర్తదీ చిన్న ఉద్యోగమే. అయినా రాధిక బయటకు వెళ్లి ఇబ్బందులు పడటం ఇష్టం లేదాయనకు. అందుకే చదువుకైతే ఒప్పుకొన్నారు కానీ... ఉద్యోగం వద్దన్నారట. కానీ పిల్లలకి చదువుకునే వయసొచ్చాక... ఆమె కలలకి రెక్కలు తొడిగే అవకాశం వచ్చిందంటారామె. 'ఇంట్లో అందరికీ సంగీతం అంటే ఇష్టం. అందుకే పిల్లలిద్దర్నీ మ్యూజిక్ క్లాస్‌లో చేర్చాను. వాళ్లతోపాటూ నేనూ నేర్చుకునేదాన్ని. అదే నా జీవితంలో టర్నింగ్ పాయింట్ అయ్యింది. సంగీతం టీచర్‌గా కెరియర్ ప్రారంభించా'అనే రాధికది విశాఖపట్నంలోని సింహాచలం. తర్వాత కుటుంబ పరిస్థితుల రీత్యా ఇంట్లోనే మ్యూజిక్, డ్యాన్స్, టైలరింగ్, మగ్గం పనులు నేర్పేవారు. తర్వాత ప్రభుత్వ పాఠశాలలో, ఓ ఎన్జీఓలో పనిచేశారీమె. అదే ఫెమీ రైడ్స్‌కు కారణమైంది అంటారు రాధిక.

**విఫలమైనా వదలకుండా...**

'ఎన్జీఓకు పనిచేస్తున్నప్పుడే పరిచయాలు పెరిగాయి. మహిళలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నా. ఎన్జీఓ ద్వారా వాళ్లకోసం ఏదైనా చేయాలనుకున్నా. ఈ క్రమంలోనే నాన్నను చూడాలని హైదరాబాద్‌కు వెళ్లా. ఇద్దరు ఆడపిల్లలతో, ఒక్కదాన్నే క్యాబ్ బుక్ చేసుకుని ఇంటికి బయలుదేరా. ఆ రోజు నేను పడ్డ భయం ఎప్పటికీ మరచిపోలేను. ఒక్కసారికే నా పరిస్థితి ఇలా ఉంటే... రోజూ వందల మంది అమ్మాయిలు ఎన్నిసార్లు ఇలా భయపడుతున్నారో అనిపించింది. అప్పుడే తెలంగాణలో షీక్యాబ్స్ ప్రారంభమయ్యాయి. అయితే అనతికాలంలోనే అవి విఫలమైనట్లు విన్నా. తెలిసిన వాళ్ల ద్వారా కారణం తెలుసుకోవడానికి ప్రయత్నించా. సంస్థాగత, నిర్వహణ, నైపుణ్యాల కొరత కారణాలని తెలిసింది. మహిళా డ్రైవర్లంటే ప్రయాణికులు ఎక్కడానికే భయపడేవారు. అందుకే హైదరాబాద్‌లో ఆ ప్రాజెక్టు విఫలమైందని విన్నాను' అని గుర్తుచేసుకుంటారు రాధిక. ఇవేవీ పరిష్కరించలేనివి కాదు. కాస్త సమయం ఎక్కువ పట్టొచ్చు కానీ శిక్షణ ఇస్తే, మహిళలూ ఈ రంగంలో రాణించగలరన్న నమ్మకంతో ముందడుగు వేశారామె.

**సమయం వృథా అన్నారు...**

'డీపీఆర్(డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు) సమావేశంలో నా ఆలోచన చెప్పినప్పుడు సమయం వృథా తప్ప ఉపయోగం ఉండదు అన్నారు. కానీ మహిళలకు చేయూత దొరుకుతుందంటే ప్రయత్నించి చూడమన్నారు. నా స్నేహితురాలు ఒకామె... 'ఎన్జీఓకు మాత్రమే పరిమితం చేయకు. దీనివల్ల మహిళలకు చాలా ఉపయోగం ఉంటుంది. ఒక బిజినెస్ ప్లాన్‌గా తీర్చిదిద్దు' అంది. 2021లో ఫెమీ రైడ్స్ ప్రారంభించా. మహిళల కోసం... మహిళలే డ్రైవర్లుగా మారారిక్కడ. గులాబీ రంగును థీమ్‌గా ఎంపిక చేసుకున్నా. మంచి ప్రయత్నం అన్నారు కానీ... ఫెయిలైంది. నమ్మకం లేకపోవడం, మహిళా డ్రైవర్లంటే చిన్నచూపు ఇలా రకరకాల కారణాలు. తర్వాత పూర్తి శిక్షణతో క్షేత్రస్థాయిలోకి వస్తున్నాం అన్నప్పటికి లోన్లు ఇచ్చేవాళ్లు దొరకలేదు. సిబిల్ స్కోర్ ఇష్యూస్ వచ్చాయి. అలా మూడుసార్లు విఫలమైనా... వెనకడుగు వేయకుండా నడిపిస్తున్నా. ఇప్పుడు మా దగ్గర శిక్షణ తీసుకుని పనికి సిద్ధమైన వాళ్లకి కార్లు, బైక్లు రిపేర్‌తో సహా... ప్రాథమిక చికిత్స కూడా నేర్పుతున్నాం. అన్నింట్లో అర్హత సంపాదించుకున్నాకే రైడ్స్‌కు పంపుతున్నాం. స్థానికంగా మా వాహనాలు, డ్రైవర్లు అందుబాటులోకి వచ్చినా... దీనిద్వారా ఈ మహిళలంతా పూర్తిస్థాయిలో స్వయం ఉపాధి పొందినప్పుడే నేను విజయవంతమైనట్లు' అంటారు రాధిక. ఇటీవల కొన్ని కారణాల వల్ల థీమ్ కలర్‌ను ఊదాగా మార్చుకున్నారు.

## సక్సెస్ వాయిస్

## విద్య... అందరికీ చేరువ కావాలి




సమాజంలో విద్య... గౌరవం... అందరికీ సమానంగా దొరకడం లేదు. ఈ అసమానతలు తగ్గించి అందరికీ వాటిని చేరువ చేయాలంటారు షాహీన్ మిస్త్రీ. ఆ లక్ష్యంతో 'టీచ్ ఫర్ ఇండియా'ని మొదలుపెట్టి పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో అవార్డుల్నీ అందుకున్నారు. షాహీన్ ముంబయిలో పుట్టినప్పటికీ తండ్రి ఉద్యోగ రీత్యా ఆమె బాల్యమంతా విదేశాల్లోనే గడిచింది. 18ఏళ్ల వయసులో ఇండియాకి వచ్చి ముంబయి విశ్వవిద్యాలయంలో సోషియాలజీలో బీఏ పూర్తిచేశారు. ముంబయి మురికివాడల్లో ప్రజల్ని గమనించిన ఆమె వారి జీవితాల్లో మార్పు తేవాలనుకున్నారు. 'విద్యతో మాత్రమే వాళ్ల జీవితాల్ని మార్చాలనుకున్నా. కుటుంబంలో ఒక్కరు చదువుకున్నా సమాజంలో పెద్ద మార్పే వస్తుంది. అందుకే వాళ్లకు చదువు చెప్పాలనుకున్నా' అంటారు షాహీన్. ఇందుకు 1989లో ఆకాంక్ష ఫౌండేషన్‌ని మొదలుపెట్టారు. కాలేజీ అయ్యాక మురికివాడలకు వెళ్లి అక్కడి పిల్లలకు పాఠాలు చెప్పేవారు. 15 మంది పిల్లలతో దీన్ని మొదలుపెట్టారు షాహీన్. ఆర్థికంగా వెనకబడిన పేద విద్యార్థులకు విద్యను అందించడమే దీని ప్రధాన ఉద్దేశం. తన ఆశయం నచ్చడంతో ఆమె స్నేహితులు కూడా తనతో చేయి కలిపారు. నెమ్మదిగా విద్యార్థుల సంఖ్యా పెరిగింది. అయితే దీన్ని ముంబయికి మాత్రమే పరిమితం చేయాలనుకోలేదు షాహీన్. ఎక్కువ మంది విద్యార్థులకు చేరువ చేయాలనుకున్నారు. దానికోసం దేశం మొత్తమ్మీదా ఎనిమిది నగరాల్లో 900 సహచరులు, 250 మంది సిబ్బందితో 2008లో 'టీచ్ ఫర్ ఇండియా'ని స్థాపించారు. ఇప్పటి వరకూ పది లక్షల మంది ప్రత్యక్షంగా, 33లక్షల మంది విద్యార్థులకు పరోక్షంగా విద్యను అందించారు. 'గ్రామంలో ప్రతి చిన్నారి చదువుకోవాలి' అనే షాహీన్ టీఎఫ్ఐఎక్స్.టీచ్ ఫర్ ఇండియా.ఆర్గ్ వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఇదొక ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చదువును చేరువ చేస్తున్నారు. దీంట్లో పిల్లలు పాఠాలను వాళ్ల ప్రాంతీయ భాషల్లో వినొచ్చు. వివిధ ఆమె చేసిన సేవలకిగాను అశోక ఫెలో, బియాండ్ బిజినెస్, ఈటీ ప్రైమ్ ఉమెన్ లీడర్‌షిప్ అవార్డులతోపాటు పలు ప్రశంసలూ అందుకున్నారు.

# ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

**వల్నరబుల్ ఏరియాల్లో ప్రతిపాదించిన పనులు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలి : కలెక్టర్ కీర్తి చేకూరి**

**బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి.. సమన్వయంతో పనిచేయాలి : ఎస్పీ డి.నరసింహ కిషోర్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో రహదారులపై ప్రమాదాలు నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, వల్నరబుల్ ఏరియాల్లో ప్రతిపాదించిన చర్యలను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రధాన రహదారులపై జరుగుతున్న ప్రమాదాలపై సమీక్ష నిర్వహించారు. రహదారి ప్రమాదాలు, పోలీస్ స్టేషన్ వారీ వివరాలు, రహదారి భద్రత అమలు, ఐరాడ్ అప్లికేషన్‌లో ప్రమాదాల డేటా నమోదు, హిట్ అండ్ రన్ కేసులు, బ్లాక్ స్పాట్లు తదితర అంశాలపై జిల్లా పోలీస్,రవాణా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల నిర్వహణకు అవసరమైన బ్రీత్ అనలైజర్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే 31 బ్లాక్ స్పాట్లు, 12 అధిక ప్రమాద ప్రాంతాలు గుర్తించామని, ఈ ప్రాంతాల్లో ప్రమాదాల కారణాలను విశ్లేషించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ రహదారులను అనుసంధానం చేసే అప్రోచ్ రోడ్లలో ప్రమాదాల నివారణకు రంబుల్ స్ట్రిప్స్, బ్లింకర్లు, లైటింగ్ వంటి సదుపాయాలు పంచాయితీలు, రుడా నిధుల ద్వారా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గెయిట్ కాలేజీ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న మీడియన్ ఓపెనింగ్ కారణంగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, దానిని మూసివేసి సురక్షిత ప్రదేశంలో మార్పు చేయాలని సూచించారు. జాతీయ రహదారి 16 నుంచి ఎడిబి రహదారిని అనుసంధానించే మార్గంలో ఒక కిలోమీటరు మేర లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. గామన్ బ్రిడ్జి మరమ్మత్తుల సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, కొవ్వూరు వైపు రోడ్ కం రైల్వే బ్రిడ్జి ఎక్కే ప్రదేశంలో సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులపై బొమ్మూరు, రాజానగరం, దేవరపల్లి, కడియం, నల్లజర్ల, రంగంపేట మండలాల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. మే నుంచి జూన్ వరకు, సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు ప్రమాదాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని చెప్పారు. లైటింగ్ లోపం, సైన్ బోర్డుల కొరత, అప్రోచ్ రోడ్లలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, హెల్మెట్ వినియోగం లేకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయని వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు తరచుగా నిర్వహిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం రహదారి ప్రమాదాలు స్వల్పంగా తగ్గాయని పేర్కొన్నారు. రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్లలో లైటింగ్ మెరుగుదల వంటి చర్యల వల్ల ఈ మార్పు సాధ్యమైందన్నారు. ఐరాడ్ యాప్‌లో పోలీసులు ప్రమాదాల వివరాలు నమోదు చేస్తున్నారని, ట్రాన్స్‌పోర్ట్, మున్సిపల్ అధికారులు కూడా సంబంధిత వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, ఆర్ అండ్ బి అధికారి ఎస్ బి వి రెడ్డి, కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, పోలీస్, రవాణా , ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు , వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దే పెన్షన్ పంపిణీపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని 14వ స్వర్ణ వార్డు, ప్రకాష్ నగర్-01 ప్రాంతంలో లబ్ధిదారులను ప్రత్యక్షంగా కలుసుకుని, పెన్షన్ సొమ్ము సక్రమంగా ఇంటి వద్దనే అందుతున్నదా లేదా అనే విషయాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక దానవాయిపేటలో పాన్ షాప్ నిర్వహిస్తున్న కూరపాటి ధనలక్ష్మికి సంబంధించిన దివ్యాంగ పెన్షన్‌ను కలెక్టర్ కీర్తి చేకూరి, మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి, పెన్షనర్ ధనలక్ష్మి ఆరోగ్య పరిస్థితి, జీవనోపాధి గురించి వివరాలు తెలుసుకుని, స్వయం ఉపాధి ద్వారా ముందుకు సాగుతున్నందుకు అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతోందని, ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద మొత్తం 2,69,753 మందికి రూ.118,56,75,000లను ఏప్రిల్ 1న పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 22 మండలాలు, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థతో పాటు 3 పురపాలక సంఘాల పరిధిలో లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ జరుగుతోందన్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లాలో 2,37,032 మంది (88 శాతం) లబ్ధిదారులకు రూ.103,62,54,000లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన వారికి కూడా త్వరితగతిన పెన్షన్ అందించేందుకు క్షేత్రస్థాయిలో పిడివోలు పని చేస్తున్నారని తెలిపారు.

**సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన ధనలక్ష్మి**

ఈ సందర్భంగా కూరపాటి ధనలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం తన ఇంటి వద్దనే పెన్షన్ అందించడం ఎంతో సౌకర్యంగా ఉందని, ఈ నెల స్వయంగా కలెక్టర్, కమిషనర్ వచ్చి అందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.6,000 తన జీవనోపాధికి ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా, డీఆర్‌డీఏ పీడీ బి. నగేష్, ఆర్ఎంసీ కార్యదర్శి శైలజ వల్లి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గొర్లె మాలతికి పదవీ విరమణ సత్కారం

**- ఉపాధ్యాయునిగా, గృహిణిగా చేసిన సేవలకు కితాబు**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ వెంకటగిరి జడ్పీపి హెచ్ స్కూలు ప్రధానోపాధ్యాయని గొర్లె మాలతి పదవీ విరమణ సందర్భంగా స్కూలులో ఘనంగా అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. పలువురు ఉపాధ్యాయినిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. 1964 మార్చి 4వ తేదీన మారేడుమిల్లి మండలం పుల్లంగి గ్రామంలో లక్ష్మీకాంతయ్య,సుగుణమ్మ దంపతులకు జన్మించిన మాలతి 1983లో విద్యారంగంలో అడుగుపెట్టారు.1987లో కొలిపే విజయకుమార్ సహచర్యంతో కుటుంబ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, ముగ్గురు కుమారులను ఉన్నతంగా తీర్చిదిద్ది సమాజానికి ఆదర్శంగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. శాలువాతో, పూలమాలతో సత్కరించి జ్ఞాపిక, సన్మాన పత్రం అందజేసారు. పలువురు పూలమాలలతో ముంచెత్తారు.అభినందన సభలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పార్కిన్సన్ బాధితులకు 'యశోద' పునర్జన్మ

**◆ డీబీఎస్ శస్త్రచికిత్సతో వణుకుడు వ్యాధికి శాశ్వత పరిష్కారం**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తున్న న్యూరో- డిజెనరే టివ్ వ్యాధులలో పార్కిన్సన్ ప్రధానమైందని, దీనివల్ల రోగుల దైనందిన జీవితం అతలాకుతలమ వుతుందని హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ మరియు పార్కిన్సన్ డిసీజ్ అండ్ మూవ్మెంట్ డిసార్డర్స్ రీసెర్చ్ సెంటర్ క్లినికల్ డైరెక్టర్ రాజేష్ అలుగోలు పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో పార్కిన్సన్ వ్యాధి తీవ్రత మరియు ఆధునిక చికిత్సల గురించి వివరించారు. మన దేశంలో ప్రతి లక్ష మంది జనాభాలో సుమారు 42 నుండి 60 మంది వరకు ఈ వణుకుడు వ్యాధి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శరీర అవయవాలపై నియంత్రణ కోల్పోవడం, విపరీ తమైన వణుకు, నడకలో ఇబ్బందులు వంటివి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలుగా ఉంటాయని వివ రించారు. హుజూరాబాద్‌కు చెందిన అశోక్ రెడ్డి మరియు కాజీపేటకు చెందిన సంగీత గత కొంతకాలంగా పార్కిన్సన్ వ్యాధితో తీవ్రంగా బాధపడుతూ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్‌ను ఆశ్రయించారని, అక్కడ వారికి నిర్వహించిన డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ శస్త్రచికిత్స అద్భుత ఫలితాలను ఇచ్చిందని వెల్లడించారు. నిపుణులైన వైద్య బృందం ఆధ్వర్యంలో ఈ సంక్లిష్ట ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేయడంతో ప్రస్తుతం ఆ ఇద్దరు రోగులు పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని స్పష్టం చేశారు. పార్కిన్సన్ అనేది బీపీ, షుగర్ మాదిరిగా జీవితాంతం పీడించే సమస్య అని, వ్యాధి ప్రారంభమైన మొదటి మూడు నుంచి నాలుగేళ్ల వరకు మందులు పనిచేసినప్పటికీ, కాలక్రమేణా లక్షణాలు పెరిగి మందుల ప్రభావం తగ్గుతుందని వివరించారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులకు యూఎస్-ఎఫ్ డీఏ మరియు డీసీజీఐ ఆమోదం పొందిన డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ ప్రక్రియ ఏకైక సమర్థవంతమైన మార్గమని పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా అంతర్జాతీయంగా అందుబాటులో ఉన్న ఈ డీబీఎస్ విధానం రోగుల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచు తుందని, ఈ ప్రక్రియలో మెదడులోని నిర్దిష్ట భాగంలో ఎలక్ట్రోడ్లు అమర్చి, వాటిని ఛాతీలో అమర్చే ఒక చిన్న పరికరంతో అనుసంధానం చేస్తారని సాంకేతికతను వివరించారు. దీనివల్ల మెదడుకు అందే సంకేతాలు క్రమబద్ధీకరించబడి వణుకు నియంత్రణలోకి వస్తుంది. హైదరాబాద్ లోని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ విభాగంలో సుమారు 2,000 పడకల సామర్థ్యంతో, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సూపర్ స్పెషాలిటీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ డీజీఎం సంతోష్ కుమార్, టీఎల్ఎస్ వీవీ రామకృష్ణ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాయవరం మండల ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన గోపాల్



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాయవరం మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న వై.ఎన్.ఎం గోపాల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను బుధవారం స్వీకరించారు. బాధ్యతల స్వీకరణకు ముందు ఆయన మండపేట శాసనసభ్యులు, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. అనంతరం రాయవరంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు మండల పరిషత్ అధ్యక్షులు నౌడు వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో(ఎస్.జి.ఎస్.డబ్ల్యూ) వి.వి.ఆర్ కృష్ణంరాజు, ఏపీఓ ఎస్.సుధారాణి, వివిధ శాఖల అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ అభివృద్ధి అధికారులు, స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొని గోపాల్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి కోసం కృషి చేస్తానని నూతన ఎంపీడీవో గోపాల్ తెలిపారు.

# కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గం ప్రకటించిన తమ్మిరెడ్డి



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కిసాన్ మోర్చా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించినట్లు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి మంగళవారం తెలిపారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి ఆదేశాలు, జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ సూచనల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతు సంక్షేమం, పార్టీ బలోపేతం లక్ష్యంగా పనిచేసే నాయకులకు ఈ కమిటీలో ప్రాధాన్యత ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ నూతన కమిటీలో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, ఖజాంచి, సోషల్ మీడియా కన్వీనర్, కార్యవర్గ సభ్యులను నియమించారు. రాయవరం, మండపేట, కొత్తపేట, రామచంద్రపురం, అమలాపురం తదితర ప్రాంతాలకు చెందిన పలువురు నాయకులు ఈ కమిటీలో చోటు దక్కించుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైతు సమస్యల పరిష్కారం, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని చింతా తమ్మిరెడ్డి పిలుపునిచ్చారు.

# కష్టపడి పని చేసే కార్యకర్తలకు తప్పక గుర్తింపు

**తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. గ్రామ, వార్డు స్థాయి నుంచి తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రామచంద్రపురం పట్టణంలోని 13వ వార్డు కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ఏఎంసి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తో కలిసి పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు తప్పక లభిస్తుందని ఈ సందర్భంగా సత్యం హామీ ఇచ్చారు. పట్టణ, గ్రామ, వార్డు కమిటీ నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పని చేసి టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం మేరకు అన్ని కమిటీలను విజయవంతంగా నియమించడం జరిగిందని, వీరంతా పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమం క్లస్టర్ వన్ ఇంచార్జ్ మేడిశెట్టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. తెలుగుదేశం పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు చందమామ వాసు, సెక్రటరీ కవల నానాజీ, పట్టణ మహిళా అధ్యక్షురాలు వజ్రపు రాజేశ్వరి, సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, క్లస్టర్ 2 ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, ఎస్ కే పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, శివాలయం ట్రస్ట్ చైర్మన్ గణేష్ శర్మ, మాజీ కౌన్సిలర్లు గడి గోవిందు, అల్లం శ్రీనివాస్, కట్టా నాగేశ్వరరావు, లంకే శ్రీను, వార్డు పెద్దలు కొవ్వూరి సూర్యనారాయణ రెడ్డి, పోతంశెట్టి దొరబాబు, టేకుమూడి సత్యనారాయణ, అంపోలు సత్యనారాయణ, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఘనంగా 13వ వార్డు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం**

13వ వార్డు అధ్యక్షులుగా కిల్లి వెంకటాచల వరాహగిరి, సెక్రటరీగా మహమ్మద్ సహిదా బేగం, ఉపాధ్యక్షులుగా శీలం అన్నవరం, మరియు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమం ఆద్యాంతం ఘనంగా జరిగింది.

# కొమరగిరిపట్నం సహకార సంఘం రైతులకు డివిడెండ్లు విడుదల

**రైతులకు ఆదరణగా మెట్ల రామమూర్తి సహకార సంఘం**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

జిల్లాలోని రైతులకు డివిడెండ్లు విడుదల చేసి ఆదర్శంగా నిలిచిన సహకార సంఘంగా కొమరాగిరిపట్నం మెట్ల రామమూర్తి ప్రాథమిక సహకార సంఘం నిలిచింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 303 సహకార సంఘాలు ఉండగా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 166 సంఘాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతుల షేరు ధనంపై వడ్డీ రూపంలో డివిడెండ్లు విడుదల చేసిన సంఘంగా మెట్ల రామమూర్తి సహకార సంఘం ప్రత్యేక గుర్తింపు పొందింది. సుమారు 108 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ సహకార సంఘం, స్థాపన నాటి నుండి మెట్ల వంశీయుల ఆధ్వర్యంలోనే కొనసాగుతోంది. రాష్ట్రంలో అరుదుగా కనిపించే విధంగా కొమరాగిరిపట్నం గ్రామంలో రెండు సహకార సంఘాలు ఉన్నప్పటికీ, మెట్ల రామమూర్తి సహకార సంఘమే ఏకగ్రీవంగా అధ్యక్ష పదవిని నిర్వహిస్తూ రైతులకు సేవలు అందిస్తోంది. ఈ సంఘం ద్వారా రైతులకు సబ్సిడీపై ఎరువులు, పశువుల ఆహారం, తాగునీటి శుద్ధి కేంద్రం, ధాన్యం కొనుగోలు సౌకర్యం, రేషన్ దుకాణం, దీర్ఘకాలిక రుణాలు, స్వల్పకాలిక రుణాలు, లోన్ డిపాజిట్లు, పునరావృత డిపాజిట్లు (పొదుపు ఖాతాలు) వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. సంఘం చుట్టుపక్కల గ్రామాల్లో వాణిజ్య బ్యాంకులు ఉన్నప్పటికీ, ఈ సహకార సంఘం సులభంగా అందుబాటులో ఉండటం వల్ల చిన్న రైతుల నుండి పెద్ద రైతుల వరకు అందరూ ఇక్కడే తమ పొదుపు ఖాతాలను నిర్వహిస్తూ సంఘాన్ని ప్రశంసిస్తున్నారు.

# ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లంశేఖర్‌కు ఘన సన్మానం




**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజక వర్గం,దేవీపట్నం మండలం, శరభ వరం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయం నందు జరిగిన వార్డ్ మెంబర్ల సన్మాన సభకు దేవారం గ్రామపంచాయతీ సర్పంచ్ రమాదేవి,శరభవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ కొమరం లక్ష్మీ దేవీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో సాల్మన్ రాజ్ మాట్లాడుతూ, వార్డ్ మెంబర్లగా ఎన్నికైన నాటి నుండి నేటికి ఐదు సంవత్సరాల పూర్తి కావస్తున్న,మీరు గ్రామాల అభివృద్ధికి అందించిన సేవలు అమోఘంగా అందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.ఎంపిటిసి తుర్రం జగదీష్ దొర మాట్లాడుతూ వార్డ్ మెంబర్లగా ఎన్నికైన నాటి నుండి నిరంతరం అభివృద్ధి కోసం సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. స్పెషల్ ఆఫీసర్ ఉమా మహేశ్వరావు మాట్లాడుతూ,వార్డ్ మెంబర్ల అందించిన ఉత్తమ సేవలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం వార్డ్ మెంబర్ల అందరికి,ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ కి,సర్పంచ్ లకి,ఎంపిటిసి సభ్యులు తుర్రం జగదీష్ దొరకి,పంచాయితీ గుమస్తాలకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసిన అధికార్ల సమక్షంలో ఘనంగా శాలువాలుతో, పూల మాలలతో ఘనంగా సన్మానం చేశారు.అలాగే స్పెషల్ ఆఫీసర్ ఉమా మహేశ్వరావుకి పూల బొకే ఇచ్చి పంచాయితీ సెక్రటరీలు, ఎంపిటిసి మర్యాద పూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీలు మణికంఠ,రాంబాబు,వార్డ్ మెంబర్ తుర్రం రామన్న దొర,తుర్రం పోశమ్మ, కొమరం కృష్ణ వేణీ,పండా రామలక్ష్మి,కలుం వెంకన్న దొర,మడకం శిరీష,నారా చక్రమ్మ,కొమరం కుమార్ స్వామి,బూరయ్య,ఏవో వెంకటేశ్వర్లు,చవలం విద్యా సాగర్,పంచాయితీ గుమస్తాలు,గ్రామ పెద్దలు మహిళలు యువతీ యువకులు మొదలైన వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సైను కలిసిన ఎంపీపీ జ్యోత్స్న



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన బి.వినయ్ ప్రతాప్‌ను ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న రమేష్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
గురువారం, 02 ఏప్రియల్ 2026
www.viswamvoice.com





రాజధాని అమరావతికి

# వైసీపీ పార్టీ వ్యతిరేకం కాదు : సునీల్



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : రాజధాని పేరుతో స్కాం చేస్తున్న బిల్లుకు మాత్రమే వ్యతిరేకం. ఆంధ్రరాష్ట్ర హక్కు ప్రత్యేక హోదా అనే అంశాన్ని పక్కన పెట్టి రాజధాని బిల్లు అంటూ ప్రజలను మోసం చేస్తుంది టీడీపీ కూటమి పార్టీ ఇప్పటి వరకు ఒక్క శాశ్వతమైన కట్టడం కూడా కట్టలేని చంద్రబాబు 2లక్షల కోట్లు ఖర్చుతో అడుగుకు 1100 నుండి 1400 వరకు కాంట్రాక్ట్ ఇస్తున్నారు అంటే దేశంలో అతి పెద్ద స్కాం అమరావతి కట్టడమే అవుతుంది.ఢిల్లీ ముంబై అలాగే మన పక్కన ఉన్న తెలంగాణలో కూడా అడుగుకు 400నుండి 600వందలకే కాంట్రాక్ట్ ఇస్తున్నారు. అమరావతికి మాత్రం1100 రూపాయలు ఇస్తున్నారు అంటే ఎన్ని కోట్ల స్కాం జరుగుతుందో ప్రజలే ఆలోచన చేయాలి. నిజాన్ని నిర్భయంగా చెప్పడం జగన్ అలవాటు మోసానికి గ్రాఫిక్స్ తగిలించి మాట్లాడటం చంద్రబాబుకు అలవాటు రాష్ట్రంలో మూడు దిక్కుమాలిన పార్టీలు ఒక మతతత్వ పార్టీ, ఒక కులతత్వ పార్టీ,ఒక వెన్నుపోటు పొడిచే పార్టీ కలిసి వైఎస్ఆర్సీపీ పార్టీ పై దాడికి దిగుతున్నారు. బండారు సత్యానందరావు స్కాంలకి హద్దుల్లేవు. రాష్ట్రంలో జరుగుతున్న విద్వేషాలు,కొత్తపేట నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతిని కప్పిపుచ్చుకోవడం కోసమే చంద్రబాబు, సత్యానందరావు దెయ్యాలు వేదాలు వర్ణించినట్లు మాట్లాడుతున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో మద్యం ఎం ఆర్ పి రేట్ల కంటే అధికంగా 20రూపాయలు బండారు పేరుతో టాక్స్ వసూలు చేస్తున్నారు. 20నెలల కాలంలో బండారు చేసిన మద్యం స్కాం ఇసుక స్కాంలపై సొంత పార్టీ వారే బాహాటంగా మాట్లాడుతున్నారు. సొంత పార్టీ క్యాడర్ కాపాడుకోవడం కోసం కులాన్ని మతాన్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం తప్ప సత్యానందరావు గారు చేయగలిగేది ఏమి లేదు. జగ్గిరెడ్డి ప్రజలనాయకుడు కాబట్టే 3సార్లు ఎమ్మెల్యే గా గెలిచారు అనేది టీడీపీ వారు మర్చిపోయి మాట్లాడుతున్నారు.ఉచిత ఇసుక చంద్రబాబు, బండారు సత్యానందరావు కానీ ఎంత మందికి ఇచ్చారు అనేది చెప్పాలి.3ఉచిత గ్యాస్ అన్నారు మూడు నామాలు పెట్టారు.తల్లికి వందనం నాన్నకి ఇంధనం లాంటి స్కాంలతో టీడీపీ పార్టీ నిండి పోయింది.సూపర్ సిక్స్ స్కాంలను కప్పిపుచ్చుకోవడం కోసం దేవుళ్ళను సహితం రాజకీయాలకు ఆపాదిస్తున్న పార్టీ చంద్రబాబు పార్టీ అని కొత్తపేట నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు సునీల్ తెలియజేశారు.

ఓఎన్జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను

# కలిసిన ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి ఓఎన్జీసి రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హేమంత్ ఆర్.ముల్కాను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, యువ నాయకులు బండారు సంజీవ్‌తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు దుస్సాలువా కప్పి సత్కరించి మొక్కను అందజేశారు.కొత్తపేట నియోజకవర్గవ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు, గ్రామాల అభివృద్ధికి ఓఎన్జీసి సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. ఓఎన్జిసి సీఎస్ఆర్ ఫండ్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించాలన్నారు.

వేలాది లబ్ధిదారులకు

# రూ.18.26 కోట్ల సాయం

పింఛన్ల పండుగలా మారిన కొత్తపేట



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : కొత్తపేట నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారులకు రూ.18.26కోట్ల పంపిణీ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం పేదల సేవలో ముందుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు అన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీన పింఛన్లను అందించడం, ఒకటో తేదీన సెలవు అయితే అంతకు ముందు రోజే పింఛన్లను అందించడం వారి నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామంలో బుధవారం నాడు ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నాలుగు మండలాల్లో 57 గ్రామాలకు చెందిన 42వేల మందికి రూ.18.26కోట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. దేశంలో అధికంగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. రూ.4వేలు పింఛను అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదన్నారు. ప్రభుత్వ పరంగా పేదవర్గాలకు నేరుగా నగదు అందిస్తున్న అతి పెద్ద కార్యక్రమం దేశంలో ఇదేనని అన్నారు. ఈనాడు పింఛన్లు అందుకున్న ప్రతీ ఒక్కరి కళ్లలో ఆనందం కనపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లను పెంచడం జరిగిందన్నారు. రూ.3వేల పింఛను రూ.4వేలకు జరిగిందన్నారు. దివ్యాంగుల పింఛను రూ.6000, మిగిలినవారికి సైతం రూ.10వేలు, రూ.15వేల వరకూ పెంచిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు. స్పౌజ్ పింఛన్లు వెంటనే అందించడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీలో పాల్గొన్న నాయకులకు, ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ చేసిన ఎంపీడీఓ



కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాట్రేనికోన, మండలం చెయ్యేరు గ్రామ పంచాయతీ పరిధిలోలో ఎంపీడీఓ బి.రాజేశ్వరరావు, గ్రామ పంచాయతీ సర్పంచ్ చెల్లి సురేష్, సీనియర్ నాయకులు సుబ్బరాజు వారి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ నిర్వహించారు.పేద, బీద, బడుగు, బలహీన వర్గాలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పెద్ద ఎత్తున సామజిక భద్రతకు పెద్ద పీట వేస్తున్నాయని కొనియాడారు. సదరు ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వెల్ఫేర్ అసిస్టెంట్ మస్తాన్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ మహేష్ చేతుల మీదుగా

# వితంతు, వయో వృద్ధ పింఛన్లు పంపిణీ



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : సమాజంలో వెనుకబడిన వర్గాలకు, వృద్ధులకు, వికలాంగులకు మరియు చేతివృత్తిదారులకు భరోసా కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయడం జరు గుతుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. మండల పరిధిలోని మోడీ కుర్రు గ్రామ పరిధిలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఒక వితంతు,3 వయో వృద్ధ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా దుతూఎన్టీఆర్ భరోసాతో పేదలకు సామాజిక ఆర్థిక భద్రత చేకూరుతుందన్నారు.పేద ప్రజల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యమని ఎన్టీఆర్ భరోసా ద్వారా పేదల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ అన్నారు.ఈ సందర్భంగా లబ్ధి దారులను స్వయంగా కలిసి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియ గురించి అడిగి తెలుగుసుకున్నారు. లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అవకతవకలకు తావు లేకుండా అంకితభావంతో అత్యంత పారదర్శకత జవాబు దారీత నంతో ప్రభుత్వ మార్గద ర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్లవద్దే అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ లో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నామన్నారు వివిధ క్యాటగిరీల పెన్షన్లకు సంబంధించి మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.పింఛన్ల పంపిణీలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించ రాదని అవినీతికి తావు లేకుండా నగదు పంపిణీ నిర్వహించాలన్నారు. ప్రజలకు చేరువగా వారి వారి ఇళ్ల వద్దే పంపిణీ చేపట్టాలన్నారు పేదల సేవలో భాగంగా పేదల సేవయే పరమావధిగా ప్రభుత్వం తీసు కున్న ఈ నిర్ణయం లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపు తోందన్నారు. ఈ కార్యక్ర మం కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం ఇచ్చే ఒక పెద్ద అండ అన్నారు.గతంలో కంటే పెంచిన పింఛన్ మొత్తాన్ని నేరుగా మీ చేతుల్లో పెట్టడం ద్వారా లబ్ధిదా రులకు ఆర్థిక ఇబ్బందులు తీరుతున్నయన్నారు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఎటువంటి వివక్ష లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ సక్రమంగా అందుతోందన్నారు వృద్ధాప్యంలోఎవరిపైనా ఆధా రపడ కుండా, గౌరవంగా జీవించేలా ఈ పింఛన్ వృద్ధు లకు దివ్యాంగులకు దీర్ఘకాలిక అనారోగ్యాలతో ఉన్న వారికి భరోసాగా నిలుస్తోందన్నారు పింఛన్ అనేది మీ హక్కు, దానిని అందించడం మా బాధ్యత అన్నారు ప్రతినెలా మొదటి రోజే లబ్ధిదారులందరికీ పింఛన్ అందేలా క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నా రు.ఈ పింఛన్ మొత్తాన్ని మీరు మీ ఆరోగ్య అవసరాలకు మరియు నిత్యావసరాలకు సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచిం చారు మీకు ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించవ చ్చునన్నారు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ మీ సంక్షేమం కోసమే పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డి.రాంబాబు, మండల తాసిల్దారు రాంబాబు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి పెద్దకొడుకులా సీఎం చంద్రబాబు

దేశంలోనే అత్యధిక పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ - ప్రతి కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం
- ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ : రామచంద్రపురం పట్టణంలోని వివిధ వార్డుల్లో ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లను కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. 13వ వార్డు, 15వ వార్డు, 24, 25 వ వార్డు పరిధిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. పింఛనుదారులతో మాట్లాడి వారి ఆరోగ్య, క్షేమ, సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకులా ఉండి ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోం దన్నారు. దేశం మొత్తం మీద అత్యధికంగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమ పరిపాలనకు నిదర్శనం అన్నారు. ప్రతి నెలా సమయానికి పింఛన్లు అందించడం ద్వారా ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగు నింపుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తుందని వాసంశెట్టి సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, కూటమిపార్టీ నాయకులు మేడిశెట్టి సూర్యనారాయణ, దంగేటి గౌరీ శంకర్, కంచుమర్తి బాబురావు, గడి గోవిందు, వాసంశెట్టి బాల, ఏసుదాసు, గుబ్బల వెంకటరమణ, పదంమూర్తి, వాసంశెట్టి చంద్రశేఖర్, ప్రకాష్, వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల జీవితాల్లో కొత్త వెలుగులు



బండారులంక, విశ్వం వాయిస్ న్యూస్ : బండారులంక గ్రామములో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పత్రాలను బుధవారం ఎమ్మెల్యే ఆనందరావు పంపిణీ చేయడం జరిగింది. అమలాపురం రూరల్ మండలంలో ప్రసిద్ధ చేనేత కేంద్రమైన బండారులంక గ్రామంలో బుధవారం అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పర్యటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన మంజూరు పత్రాలను ఎమ్మెల్యే స్వయంగా కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ చేనేత కార్మికులు ఎన్నడూ మర్చిపోలేని రోజని, మగ్గాలు నేసుకుంటూ జీవనం గడిపే కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఈ గొప్ప పథకం నేటి నుండి శాశ్వతం కాబోతోందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా హ్యాండ్ లూమ్ కు 200 యూనిట్లు, పవర్ లూమ్ కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దీనివల్ల సంవత్సరానికి హ్యాండ్ లూమ్ కార్మికులకు సుమారు రూ 8,640 , పవర్ లూమ్ కార్మికులకు రూ 21,600 వరకు కరెంటు బిల్లుల భారం తగ్గుతుందని వివరించారు. గత ప్రభుత్వం కేవలం వారి పార్టీ వారికే లబ్ధి చేకూర్చిందని విమర్శిస్తూ కూటమి ప్రభుత్వం మాత్రం నిస్వార్థంగా ప్రతి అర్హులైన కార్మికుడికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మంగళగిరి నియోజకవర్గ ప్రతినిధిగా చేనేత కార్మికుల సమస్యలను క్షేత్రస్థాయిలో స్వయంగా తెలుసుకున్న మంత్రి నారా లోకేష్ బాబు ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఈ పథకాలు అమలయ్యేలా విశేష కృషి చేశారని కొనియాడారు. అగ్గిపెట్టెలో పట్టేంత చీరను నేసిన గొప్ప చరిత్ర చేనేత కార్మికులదని, మగ్గం ఉన్న ప్రతి ఇంట్లో వెలుగులు నింపి, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ రాయితీలే కాకుండా, ముడి సరుకులపై సబ్సిడీలు, మార్కెటింగ్ సౌకర్యాల కల్పనపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు, శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు పిచ్చిక శ్యామ్, విద్యుత్ శాఖ అధికారులు, చేనేత సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కంఠంశెట్టి శ్రీనివాస్‌కి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ఆనందరావు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : రావులపాలెంలో జరిగిన కొత్తపేట అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన అమలాపురం ఎమ్మెల్యే అయితబత్తుల ఆనందరావు ఆయనతోపాటు అమలాపురం అర్బన్ రూరల్ డెవలప్మెంట్ (అముడా) చైర్మన్ అల్లాడి స్వామి నాయుడు (సోంబాబు) ఏఎంసి వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు స్వగృహానికి విచ్చేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అమలాపురం నియోజకవర్గం లో కార్యక్రమాలుకు హాజరు కావడం వలన సమయం సరిపోక నిన్న జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాలేకపోయానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. కంఠంశెట్టి శ్రీనివాసరావు స్వగ్రాహానికి కొత్తపేటకు విచ్చేసిన సందర్భంగా కొత్తపేట టిడిపి నేతలు ధర్నాల రామకృష్ణ,ధర్మ పాల్, బూసి భాస్కరరావు,రెడ్డి తాతాజీ, గుబ్బల మూర్తి, పెనుమళ్ళ అన్నవరం, బండారు వీరబాబు, వీధి భాస్కరరావు, చోడపనీడి గోవింద్, అన్యం మునీస్, బూసి వెంకటరమణ, బొరుసు సత్తిబాబు, సాదా సత్తిబాబు, నిమ్మకాయల చిన్న, ముద్రగడ పణి, గోలకోటి నాగు, పినిపే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న

## గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ శ్రీ దుర్గ



రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ : రాజోలు మండలం పొన్నమండ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు మండల ఎంపీపీ కదలి శ్రీ దుర్గ చైర్మన్ శ్రీనివాస్ స్వయంగా పింఛన్లు అందించి, పింఛన్లు పంపిణీ గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మోకా ఉష ఏడుకొండలు, టిడిపి పొన్నమండ గ్రామ శాఖ అధ్యక్షులు దాకే ఏడుకొండలు, టీడీపీ సీనియర్ నాయకులు గుబ్బల నాగేంద్ర వర ప్రసాద్, మామిడిశెట్టి సత్యనారాయణ, టీడీపీ పార్టీ 8నెంబర్ క్లస్టర్ కదలి మోహన్, పొన్నమండ పోలింగ్ బూత్ కన్వీనర్ అప్పారి వీర వెంకట సత్యనారాయణ, యళ్ళమెల్లి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

రాజధాని లేని రాష్ట్రం ఉండాలని

# వైసీపీ కోరుకుంటోంది

జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : అమరావతి రాజధాని చట్టబద్ధత కోసం లోక్ సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును వ్యతిరేకించడం ద్వారా వైసిపి తన బుద్ధిని బయట పెట్టుకుంది. దేశంలో అన్ని రాజకీయ పార్టీలు అమరావతి రాజధానికి మద్దతు ఇవ్వగా వైసిపి వ్యతిరేకించడం ఆ పార్టీ దివాలా కోరుతనానికి నిదర్శనం. రాష్ట్ర ప్రగతి, కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధి నుంచి ప్రజల దృష్టి మళ్లించడం కోసమే వైసీపీ నేత చిర్ల జగ్గిరెడ్డి అవినీతి ఆరోపణలు చేస్తున్నారు.జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి గత వారి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని ఇప్పుడు వల్లెవేస్తున్నారు. చెప్పుకోవడానికి ఏమీ లేక వారు చేసిన అవినీతి అక్రమాలను ప్రస్తుత ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకి అంటగడుతున్నారు. నెలవారీ ఒకరోజు సమావేశం పెట్టడం, ఆరోపణలు చేయడం, తదుపరి మిన్నకుండిపోవడం జగ్గి రెడ్డికి అలవాటుగా మారింది.అక్రమ ఇసుక, మట్టి, మద్యంకు బ్రాండ్ అంబాసిడర్ అయిన జగ్గి రెడ్డి వాటి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. కొత్తపేట నియోజకవర్గంలో వారి ఐదేళ్ల పాలనలో ఒక్కనాడయినా రహదారుల గురించి గానీ, సాగునీటి గురించి గానీ, టెంపుల్ టూరిజం గురించి గానీ జగ్గిరెడ్డి పట్టించుకున్నది లేదు. 20 నెలల కాలంలో బండారు సత్యానందరావు నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నారు.దీనిని నియోజకవర్గ ప్రజలందరూ గమనిస్తున్నారు. విద్వేషాలుకులాల కొట్లాటలు ఎగతోయడం తప్ప జగ్గిరెడ్డి సాధించిందేమీ లేదు నియోజకవర్గంలో ప్రతి ప్రాంతం అభివృద్ధి చేస్తూ, ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని ఉపాధి పొందే దిశగా ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేస్తున్న కృషిని వైసీపీ కార్యకర్తలు కూడా కొనియాడుతున్నారు. తమ పార్టీ కార్యకర్తలను కాపాడుకోవడం కోసం అవాస్తవాలు, అబాండాలుతో జగ్గిరెడ్డి ఆరోపణలు చేస్తున్నారు అని ముత్యాల బాబ్జి తెలిపారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్

పెన్షన్ దారులలో వెలుగులు నింపుతుంది : గుబ్బల మూర్తి



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : పెన్షన్ దారులకు కూటమి ప్రభుత్వం ప్రతినెల అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ దారులకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని పెన్షన్ పంపిణీ చేసినప్పుడు వారి కళ్ళల్లో వెలుగులు నింపుతున్నాయని టిడిపి సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి తెలిపారు. ప్రతినెల పెన్షన్ పంపిణీలో భాగంగా పెన్షన్ దారుల వద్దకు సచివాలయం సిబ్బందితో కలిసి పెన్షన్ దారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ప్రతినెల పెన్షన్ పంపిణీ చేయడానికి నాయకులు వెళ్లాలా అని వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారు. అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన ఒకటే ప్రజల ముంగట పరిపాలన జరగాలని ప్రజల వద్దకే నాయకులు వెళ్లాలన్నది ఆయన ముఖ్య ఉద్దేశం. ప్రతినెల పెన్షన్ ద్వారా పెన్షన్ దారులు కలుసుకొని వారి సమస్యలను తెలుసుకునేందుకే పెన్షన్ పంపిణీలో నాయకులు కూడా పాల్గొనాలని పార్టీకి ఆదేశాలు ఇస్తున్నారు. వారి ఆదేశానుసారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపుమేరకు కొత్తపేట మూడవ వార్డులో సచివాలయం సిబ్బందితో కలిసి పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని గుబ్బల మూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మట్టా బాలు, బండి రాజీవ్, పెనిపే ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు పెన్షన్

# వికలాంగుల వద్దకే చేరిన సేవలు

రెడ్డి అనంత కుమారి



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : కూటమి పాలనకు నిదర్శనం ఇళ్ళ వద్దకే పెన్షన్ పంపిణీ హిందీలో సంభాషిస్తూ ముస్లిం సోదరుల కష్టసుఖాలు విచారించిన రెడ్డి అనంత కుమారి అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట గణేష్ కాలనీలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఒక పండుగలా సాగింది. రాష్ట్ర బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి లబ్ధిదారుల ముంగిట నిలిచారు. ముఖ్యంగా వికలాంగులు మరియు నడవలేని స్థితిలో ఉన్న వారి వద్దకు స్వయంగా వెళ్లి పెన్షన్ అందజేస్తూ వారిలో భరోసా నింపారు.అందరినీ ఆకట్టుకున్న 'అనంత' సంభాషణ పెన్షన్ పంపిణీ సమయంలో గణేష్ కాలనీలోని ముస్లిం మైనారిటీ సోదరులతో అనంత కుమారి అత్యంత ఆత్మీయంగా హిందీలో సంభాషించడం అందరినీ ఆకట్టుకుంది."ప్రభుత్వ సేవలు ఎలా అందుతున్నాయి? మీకు ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా?" అని ఆమె హిందీలో అడిగి తెలుసుకున్నారు. దీనికి లబ్ధిదారులు స్పందిస్తూ, "చాలా బాగుంది (బహుత్ అచ్ఛా హై),మా గడప వద్దకే పెన్షన్ రావడం సంతోషంగా ఉంది" అని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి అనంత కుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ ప్రకారం ప్రభుత్వం ప్రజల వద్దకు వెళ్లాలి తప్ప, ప్రజలు ప్రభుత్వం చుట్టూ తిరగకూడదు.అందుకే ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టాం. మంత్రి నారా లోకేష్ ఎప్పటికప్పుడు ఐటీ మరియు ఆధునిక పద్ధతులతో క్షేత్రస్థాయిలో సేవలను పర్యవేక్షిస్తున్నారు అందుకే నేడు వికలాంగులకు సైతం ఎక్కడా ఇబ్బంది లేకుండా వారి పడకల చెంతకే పెన్షన్ చేరుతోంది."కులమతాలకు అతీతంగా, భాషా బేధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం. పేదల ముఖాల్లో ఈ చిరునవ్వులే ముఖ్యమంత్రి చంద్రబాబు కి, లోకేష్ కి అసలైన దీవెనలు," అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ దాసరి వెంకటేశ్వరావు, దూనబోయిన ప్రదీప్, స్థానిక కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తా..

## జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్





**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలు, ప్రజాప్రతినిధులు అందరి సహకారం, సమిష్టి భాగస్వామ్యంతో కాకినాడ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని కాకినాడ జిల్లా నూతన కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. కాకినాడ జిల్లా నూతన కలెక్టరుగా ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ తన కార్యాలయంలో బుధవారం ఉదయం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. తొలుత ఆయన విశాఖపట్టణం నుండి అన్నవరం చేరుకుని శ్రీ రమా సత్యన్నారాయణ స్వామిని సతీసమేతంగా దర్శించుకుని, అర్చన, ఆశీర్వాద కార్యక్రమాలలో పాల్గొన్నారు. తదుపరి ఉదయం 9-30 గంటలకు కాకినాడ జిల్లా కలెక్టరు కార్యాలయాని చేరుకోగా ఆయనకు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డిఆర్ఓ డి.తిప్పేనాయక్, జిల్లా అధికారులు, వేదపండితుల పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. కలెక్టర్ గదిలో ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపడుతూ సంతకం చేసి, పండితుల వేదస్వస్తి, ఆశీర్వచనాలను స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియా ప్రతినిధులతో నూతన జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఘన చరిత్ర, ఎన్నో విశిష్టతలు కలిగిన కాకినాడ జిల్లాలో పనిచేయడం తనకు లభించిన అపూర్వ అవకాశమని పేర్కొంటూ, ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. విశాఖపట్నంలో కలెక్టరుగా, జివిఎంసి కమీషనరుగా విధులను నిర్వహించిన అనుభవంతో కాకినాడ జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర అబివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలు అందరికీ అందుబాటులో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు అందరికీ అందించేందుకు, అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను ముందుకు నడిపిస్తాను అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా పేదరిక నిర్మూలన, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధన ప్రాధాన్యతలుగా పనిచేస్తామని, ముందు పనిచేసిన కలెక్టర్లు చేపట్టిన వినూత్న కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కాకినాడ వ్యవసాయ ప్రధాన జిల్లా అయినందున, రైతులు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పాదనలు, ఆదాయం పొందేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లా భౌగోళిక విశిష్టతలను గరిష్ట స్థాయిలో సద్వినియోగంలోకి తేవడం ద్వారా జిల్లా ఆర్థిక ప్రగతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిసి రమేష్ బాబు, ఆర్డిఓలు ఎస్.మల్లిబాబు, ఎన్.శ్రీధర్, సిపిఓ పి.త్రినాథ్, డ్వామా పిడి పి.వెంకట లక్ష్మి, సమాచారశాఖ డిడి పి.తిమ్మప్ప, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# నేతన్నల జీవితాల్లో వెలుగు.. ఉచిత విద్యుత్‌తో ఆర్థిక భరోసా...



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి దంపతులు వాకలపూడి, వలస పాకల , తమ్మవరం,పెనుమర్తి గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో పాల్గొని పెన్షన్ దారులకు పెన్షన్లు అందించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలను అందజేస్తూ, ఉచిత విద్యుత్ పథకం అమలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ్మవరం, పెనుమర్తి, గొర్రిపూడి, వలసపాకల, వేళంగి, చిన్న మామిడాడ తదితర ప్రాంతాల్లో మొత్తం 58 మంది లబ్ధిదారులకు ఈ పథకం ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి లక్షా నాలుగు వేల చేనేత కుటుంబాలకు మేలు చేసే ఉచిత విద్యుత్ పథకం అమల్లోకి వచ్చిందని, దీని కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.150 కోట్ల వ్యయం చేయనున్నట్లు వివరించారు.గత ప్రభుత్వ కాలంలో మందగించిన చేనేత రంగానికి 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పునరుజ్జీవం లభించిందని ఆయన అన్నారు. నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కింద వేలాది మంది చేనేత కార్మికులకు పెన్షన్ మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచినట్లు చెప్పారు. త్రిఫ్ట్ పథకంలో ప్రభుత్వ వాటాను రెట్టింపు చేసి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.నేతన్నలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంతో ఖర్చులు తగ్గి ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పెంపు, నూలు సబ్సిడీ, రుణాలు, క్లస్టర్ అభివృద్ధి వంటి చర్యలతో చేనేత రంగం పునరుజ్జీవం పొందుతోందని పేర్కొన్నారు.దీని వల్ల చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కలిగి, గౌరవప్రద జీవనం సాధ్యమవుతుందని అన్నారు.నేతన్నల ఆరోగ్య రక్షణకు యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలు చేస్తుండగా, త్వరలో 'నేతన్న భరోసా' కింద రూ.25 వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. చీరాల, ధర్మవరం ప్రాంతాల్లో భారీ స్థాయిలో హ్యాండ్లూమ్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తూ పరిశ్రమకు బలమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. పిఠాపురం, మంగళగిరిలో ప్రత్యేక ప్రాజెక్టులు చేపడుతున్నట్లు వెల్లడించారు.చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచేందుకు ఎగ్జిబిషన్లు, ఈ-కామర్స్ ద్వారా విక్రయాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు పండుగల సందర్భాల్లో చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కార్మికులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొరాయిస్తున్న కిర్లంపూడి పోలీస్ జీపుతో కుస్తీలు...!

## దుస్థితిలో ఏలేశ్వరం పోలీస్ జీప్ - ప్రోటోకాల్, బందోబస్తులో పరిస్థితి ఏంటి - పాతవి మార్చి కొత్త వాహనాలు ఇవ్వాలి



**కిర్లంపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పెద్దాపురం రెవిన్యూ డివిజన్ ప్రత్తిపాడు పోలీసు సర్కిల్ పరిధిలో కిర్లంపూడి మండల పోలీస్ వాహనం ఆరోగ్య పరిస్థితి ఏమాత్రం బాలేదు. కిర్లంపూడి పోలీస్ స్టేషన్ పోలీసు వాహనం తరచూ మరమ్మతులకు మెకానిక్ షెడ్డుకు వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. విధుల్లో కీలక పాత్ర పోషించే పోలీస్ జీపులు పాడైపోయి, తరచుగా మొరాయిస్తూ ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారుల ప్రోటోకాల్ బందోబస్తు వంటి అత్యవసర విధులకు వెళ్తున్న సమయంలో కూడా పోలీసుల వాహనాలు మధ్యలో ఆగి పోతున్నాయి. అత్యవసర సమయంలో సేవలు అందించాల్సిన పోలీసుల వాహనాలు పలు సమస్యలతో ఇబ్బందులు పడటం ఆందోళన కలిగిస్తోంది. పాడైపోయిన వాహనాలతో విధులు నిర్వర్తించడం వల్ల భద్రతా వ్యవస్థపై ప్రభావం పడుతోంది. తరచూ మరమ్మతుల ఇబ్బందులు కారణంగా ప్రజా సమస్యల దగ్గరకు పోలీసులు సకాలంలో చేరుకోలేక పోయిన పోలీస్ శాఖ పనితీరుపై స్థానికులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తీవ్ర విమర్శలు, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆపదను తక్షణమే నిరోధించే అవకాశం ఉన్నప్పుడు కూడా పోలీసులకు సకాలంలో చేరుకోకపోతే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారుతుందో ఉన్నత అధికారులు గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. వెంటనే పాత జీపులను మార్చి, కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకు వస్తే మంచిదని మండల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఇలాంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ప్రజల భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీస్ ఉన్నత అధికారులను కోరుతున్నారు.

# నేడు జేఎన్టీయూకే 12వ స్నాతకోత్సవం

## గవర్నర్ చేత 36 వేల మందికి పైగా డిగ్రీలు ప్రధానం - జేఎన్టీయుకె వీసీ ప్రసాద్ వెల్లడి



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడలోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూకే) 12వ స్నాతకోత్సవం గురువారం కళాశాలలో ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ స్నాతకోత్సవంలో సుమారు 36వేల 309 మంది 2024- 25లో ఉత్తీర్ణులైన వారికి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేత పట్టాలను అందిస్తున్నట్లు జెఎన్టీయుకె విసి సిఎస్ఆర్కె ప్రసాద్ తెలిపారు. బుధవారం విసి ప్రసాద్ తన చాంబర్లో విలేకరులతో సమావేశం నిర్వహించి స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జేఎన్టీయూ 1946లో ఇంజనీరింగ్ కాలేజీగా ప్రారంభమైందని 2008లో విశ్వవిద్యాలయం హోదా స్థాయికి చేరిందన్నారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరై డిగ్రీలు ప్రధానం చేస్తున్నారని చెప్పారు అలాగే జేఎన్టీయూ అందించే గౌరవ డాక్టరేట్ శాంతాబయోటిక్ అధినేత కెఐ వర ప్రసాద్ రెడ్డికి అందించనున్నట్లు తెలిపారు. 1965 - 70లలో జెఎన్టియులో చదివారని హెపటైటిస్-బికి వ్యాక్సిన్ కనుగొన్నట్లు తెలిపారు.2005లో భారత ప్రభుత్వం వరప్రసాద్ రెడ్డికి పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందించిందని పేర్కొన్నారు. నకిలీ ధ్రువపత్రాల నిర్మూలన కోసం ఎన్ఏడి పద్ధతిలో తయారు చేస్తున్నామని 4వేల మంది విద్యార్థులకు గవర్నర్ బటన్ నొక్కడంతో ఆన్లైన్లో చేరతాయని చెప్పారు. ఇంకా కళాశాలలో నూతన కోర్సులను ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ స్నాతకోత్సవం విద్యార్థులకు ఒక పండుగ లాంటిదని దీనికి అందరూ హాజరు కావాలని వీసి ప్రసాద్ కోరారు. ఉత్తీర్ణులైన 93 శాతంలో కేవలం 7 శాతం మంది మాత్రమే పీజీలు చేస్తున్నారని ఇది చాలా తక్కువ అని వీసీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రెక్టార్ పి.సుబ్బారావు, రిజిస్టర్ ఆర్ శ్రీనివాసరావు, విసి ఓఎస్డి డి.కోటేశ్వరరావు, డైరెక్టర్ ఎంహెచ్ఎం కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా ఎన్టీఆర్ భరోసా

## మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం నిరుపేద వృద్ధులకు, వికలాంగులకు అండగా ఉంటుందని రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ పేర్కొన్నారు. కాజులూరు మండలం గొల్లపాలెం, జగన్నాథగిరి గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడి వారి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు, ప్రభుత్వ పథకాల లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛన్లను లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా సకాలంలో అందజేస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పేదలు, వృద్ధులు, ఒంటరి మహిళలు దివ్యాంగులకు ఆర్థిక సహాయం అవుతుందని, ఈ పింఛన్ వల్ల అనేక కుటుంబాలు గౌరవంగా జీవిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అర్హులందరికీ పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, ఉపాధ్యక్షులు మేడిశెట్టి వివి సత్యనారాయణ, రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికార ప్రతినిది వనుం వీరబ్రహ్మాం, క్లస్టర్ ఇంచార్జిలు సలాది సాయిబాబు, పలివెల రాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు నక్కా శ్రీను, సురేష్ దవులూరి కోశాధికారి, మాధవరపు శ్రీరామ్ మూర్తి, బొమ్మిడి సోమాలమ్మ, మండల తెలుగు యువత అధ్యక్షులు అత్తిలి వెంకటరమణ, నల్ల వసంత హరిణి, పైడికొండల రాజేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రెడ్డి శేషగిరిరావు, ఖండవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా 'పేదల జీవితాల్లో వెలుగులు'



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో జరిగింది. బుధవారం ఉదయం ఒకటో తేదీ కావడంతో కరప, కాకినాడ రూరల్ మండలాల పరిధిలోని కరప, స్వామి నగర్, చీడిగ, కొవ్వాడ, ఇంద్రపాలెం వంటి గ్రామాల్లో వితంతువులు, వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావులు పాల్గొని లబ్ధిదారులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, సమాజంలో నిస్సహాయులకు దక్కుతున్న గౌరవమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం వల్ల గతంలో ఎన్నడూ లేని విధంగా సామాజిక పెన్షన్ దారులకు ఆదరణ పెరిగిందని, పెన్షన్లు అందుకునే ప్రతి కుటుంబానికి ఆయన ఒక పెద్దన్నగా నిలిచారని కొనియాడారు. లబ్ధిదారుల పట్ల ప్రేమ, అభిమానం పెరిగేలా ఈ పథకాన్ని రూపొందించడం వల్ల పేద ప్రజల్లో ధీమా పెరిగిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి దేవు వెంకటేశ్వరరావు (వెంకన్న), కొండా వినాయక్, కుడుపూడి వీరబాబు, దమ్ము నూకరాజు, వనం గణేష్, ఇంరవ రాంబాబు, కరెడ్ల చక్రరావు, పేపకాయలు నాగేశ్వరరావు, అనిశెట్టి గంగాధర్, కోన వెంకటలక్ష్మి, పేపకాయలు సూరిబాబు, దంగేటి రమణతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీసత్యదేవుని దర్శించుకున్న కాకినాడ జిల్లా కలెక్టర్




**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కలెక్టరుగా బాధ్యతలను స్వీకరించిన ఆర్. హరేంధిర ప్రసాద్, ఆయన సతీమణి ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన రత్నగిరి శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామిని బుధవారం దర్శించుకున్నారు. కలెక్టర్ దంపతులకు ఆలయ ప్రధాన అర్చకుడు, వేద పండితులు, అర్చకులు, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వేంద్ర త్రినాధరావు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఈ దంపతులు స్వామి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి వేద ఆశీర్వచనాన్ని వేద పండితులు, శ్రీస్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలను కార్యనిర్వహణ అధికారి త్రినాధరావు అందజేశారు. దర్శనం అనంతరం ఆలయ పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. భక్తులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. సాధారణంగా జిల్లా కలెక్టర్లు బాధ్యతలు స్వీకరించిన తర్వాత లేదా ముఖ్యాంశాల సమయంలో ఈ విధంగా క్షేత్రాలను సందర్శించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, స్థానిక ఎస్సై జి.శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ చైర్పర్సన్ దంపతులకు ఘన సన్మానం



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణంలోని స్థానిక శ్రీ కామాక్షి కార్పెంటర్ కార్యాలయంలో అధ్యక్షుడు సేనాధిపతి రాజబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు.అనంతరం నగర పంచాయతీ మాజీ చైర్ పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య దంపతులకు పదవీకాలం ముగిసిన సందర్భంగా యూనియన్ సభ్యులు ఘన సన్మానం చేశారు.ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ పదవీకాలం ముగిసిన పట్టణ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని,కార్పెంటర్ యూనియన్ సభ్యులు అందరికీ నా సహాయ సహకారాలు తప్పకుండా ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొమ్మోజు తాతాచార్యులు,సెక్రెటరీ దుద్దుపూడి ఏసు,కార్యవర్గ సభ్యులు జామి రాజు,జామి శ్రీను, సంఘ పెద్దలు జామి ఆదినారాయణ, సింహాద్రి బ్రహ్మం,కిల్లంపల్లి శ్రీను, ఇంజరుపు ప్రసాదు,చిట్టిమోజు త్రిమూర్తులు,తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# కూతురిని చూడాలనే ఆత్రుత - ఆ తండ్రికి ఆఖరి ప్రయాణమైంది



**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** కూతురిని చూసి పలకరించాలన్న ఆ తండ్రి ఆరాటం, మనవడితో సాగిన ఆ సరదా ప్రయాణం ఊహించని విషాదాంతమైంది. అతివేగంగా దూసుకొచ్చిన కారు రూపంలో మృత్యువు కబళించడంతో, ఒక నిరుపేద కుటుంబంలో తీరని చీకట్లు అలముకున్నాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మాచర గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గుత్తుల రామకృష్ణ (60), బుధవారం ఉదయం తన మనవడు విజయ్‌తో కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై తూరంగిలో ఉన్న తన కుమార్తె ఇంటికి బయలుదేరారు. అయితే, కరప మండలం పెనుగుదురు శివారులోని పెట్రోల్ బంకు వద్దకు రాగానే, కాకినాడ వైపు నుంచి అత్యంత వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన ఎర్టిగా కారు వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ?ఈ ఘోర ప్రమాదంలో రామకృష్ణ కింద పడగా, ఆయన శరీరంపై నుంచే కారు చక్రం దూసుకుపోవడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మనవడు విజయ్ రోడ్డుపై ఆర్తనాదాలు చేస్తుండగా, సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా గుర్తించిన కరప ఎస్సై తోట సునీత, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కళ్లముందే తండ్రి విగతజీవిగా మారడంతో ఆ కుమార్తె గుండెకోత, మాచర గ్రామంలో నెలకొన్న విషాద ఛాయలు చూసేవారిని కలచివేస్తున్నాయి.

# ప్రభుత్వ ఆస్తులను కాపాడి టీడీపీ వర్మకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేయండి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోట్లాది రూపాయల విలువైన ప్రజల ఆస్తి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఇటీవల టూరిజం శాఖ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు కేటాయించిన స్థలాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో నూతన కాకినాడ జిల్లా కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన ఎంఎస్ హరేంద్ర ప్రసాద్' ని మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం మొట్టమొదటి వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ టూరిజం శాఖ విడుదల చేసిన జీవో నెంబర్ ఎంఎస్ నెంబర్ 17ను వెంటనే రద్దు చేయాలని ఆయన కోరారు వాస్తవంగా జీవో నెంబర్ 17లో వర్మకు మూడు ఎకరాల నాలుగు సెంట్లు స్థలం ఇక్కడే ఉందని ప్రాంతం చూపించలేదని కానీ అనధికారికంగా ఆర్అండ్బి ఇరిగేషన్ తదితర శాఖలు వర్మ స్థలం ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని మధు ఆరోపించారు. రాష్ట్రంలోనే పేరుగాంచిన గర్ల్స్ పాలిటెక్నిక్ హాస్టల్ పక్కనే ఫైవ్ స్టార్ హోటల్స్ నిర్మిస్తారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఒకపక్క ఆయుర్వేద 30 పడకల ఆసుపత్రి పూర్తయిన దానిని ప్రారంభించకుండా ఎందుకు నాటకాలు ఆడుతున్నారని ఆయన అధికారులను ప్రశ్నించారు. ఆసుపత్రి పక్కనే మెడికల్ కాలేజ్ నిర్మించకుండా పిఠాపురంకు తరలిస్తారా ఇది ఎంతవరకు న్యాయమని ఆయన అధికారులను కోరారు. అధికారులను మంత్రులను కలిసి శాంతియుతంగా వినతి పత్రాలు అందజేస్తున్నామని అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఇక పోరాటాల మార్గం చేపడుతామని మధు పిలుపునిచ్చారు జిల్లా కలెక్టర్'ను కలిసిన వారిలో కాకినాడ జిల్లా సిపిఐ కార్యదర్శి కే బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు బొబ్బిలి శ్రీనివాస్, ఏఐటియుసి నాయకులు రాజేష్, మహిళా సమాఖ్య నాయకురాలు పద్మ, భవాని, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# నూతన కలెక్టర్‌కు కరప ఎంపీడీవో మర్యాదపూర్వక భేటీ



**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా నూతన కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్‌ను కరప ఎంపీడీవో జటావల్లభుల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిలో భాగంగా కరప మండల పురోగతికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని శ్రీనివాస్ పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో మండల స్థాయి అధికారుల పాత్ర కీలకమని, అందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాను అగ్రగామిగా నిలపాలని సూచించారు. అధికారులు, యంత్రాంగం మధ్య సఖ్యతతోనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఈ భేటీ ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.



# కోర్టు తీర్పుల్లో రాజకీయ జోక్యం

**దళిత క్రైస్తవులపై ఇచ్చిన తీర్పుని ఖండిస్తున్నా - దళితులు రాష్ట్ర, దేశ రాజకీయాలను శాసించబోతున్నారు**
**రాష్ట్రంలో దళితులు, కాపుల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది - మనవాళ్ళ గ్యాస్ కష్టాలు వదిలేసి ఎగుమతు లేంటి?**
**యుద్ధం ఆపడానికి మోడీ చేసిందేమి లేదు - ఎన్ని శాసనాలు చేసినా అమరావతి ఉండదు..**
**డబ్బంతా అమరావతిలో పోయడం దారుణం - కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ సంచలన వ్యాఖ్యలు**

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** కోర్టు తీర్పులలో రాజకీయం జోక్యం కనిపిస్తోందని, దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ వర్తించదంటూ ఇచ్చిన తీర్పు ఇందుకు తార్కారణమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ ఆరోపించారు. ఈ తీర్పుని ఖండిస్తున్నానని ఆయన అన్నారు. హోటల్ మంజీరాలో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో చింతా మోహన్ మాట్లాడుతూ గతంలో పివి నరసింహారావు హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలీజియం ద్వారా జడ్జీల నియామకం చేసేదని పేర్కొన్నారు. బిజెపి వచ్చాక ఆ విధానం తీసేశారని, జడ్జీల నియామకం మొదలుకుని బదిలీల వరకు అన్నింటా రాజకీయ జోక్యం ఉందని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ నుంచి జడ్జి బదిలీ కావాలన్నా, ఒక జడ్జి నియామకం కావాలన్నా బిజెపి, ఆర్ ఎస్ ఎస్ అనుమతి కావాలని అన్నట్లుగా ఉందని ఆయన విమర్శించారు. దళిత క్రైస్తవులకు సంబంధించి వచ్చిన తీర్పు అమానుషంగా ఉందని చింతా మోహన్ అన్నారు. వేల సంవత్సరాల నుంచి దళితులు అంటరాని తనానికి గురయ్యారని, ఇంకా గురవుతూనే ఉన్నారని ఆయన అన్నారు. దళితులు క్రైస్తవంలోకి మారితే కాపు, కమ్మ, బ్రాహ్మణ అయిపోతారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి



వస్తే, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తుందని ఆయన చెప్పారు. ఇందిరాగాంధీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఎస్సీలకు ఎన్నో కార్యక్రమాలు అమలుచేస్తే, జగన్ హయాంలో ఎస్సీ కార్పొరేషన్‌ని నిర్వీర్యం చేసేశారని, ఇప్పుడు చంద్రబాబు అదే మార్గం అనుసరిస్తున్నారని చింతామోహన్ విమర్శిం చారు. దేశంలో ఎస్సీలను విడగొట్టడానికి ఎబిసిడి వర్గీకరణ తెచ్చారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో దళితుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, కాపుల పరిస్థితి కూడా అలాగే ఉందని ఆయన అన్నారు. కాపులు ఆర్థికంగా ఎదుగుతారని అనుకున్నానని కానీ అలా జరగలేదని అయన విశ్లేషించారు. అయితే 2029లో రాష్ట్ర రాజకీయాలనే కాదు,దేశ రాజకీయాలను దళితులు శాసించబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు. ఇరాన్, అమెరికా యుద్ధం నడుస్తుంటే మన ప్రధాని మోడీ ఏమాత్రం చలించకుండా తిరుగుతున్నారని చింతామోహన్ విమర్శించారు. 1991లో ఇరాక్, కువైట్ యుద్ధం జరుగుతుంటే అప్పటి కాంగ్రెస్ ప్రధాని రాజీవ్ గాంధీ ఢిల్లీలో కూర్చోకుండా రష్యా వెళ్లి గోర్బచెవ్ తో మాట్లాడారని, టెహరాన్ వెళ్లి నాలుగు రోజులు అక్కడే ఉండడమే కాకుండా అమెరికా ప్రెసిడెంట్ తో కూడా మాట్లాడి యుద్ధం ఆగేలా చేసారని ఆయన అన్నారు. మరి ఇప్పుడు చేసిందేమీలేదని అన్నారు. గ్యాస్ దొరకక మనవాళ్ళు నానా ఇబ్బందులు పడుతూ హోటల్స్, రెస్టారెంట్లు మూతబడుతుంటే, గ్యాస్‌ని ఎగుమతి చేయడం ఎలాంటి విధానమో అర్థం కావడం లేదని చింతా మోహన్ వాపోయారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన మోడీ నిరుపేదలను పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తులకు ఉపయోగ పడేలా వ్యవహరిస్తున్నారని, అందులో భాగంగా 14న్నర లక్షల కోట్ల బడాబాబుల రుణాలను రద్దుచేశారని చింతామోహన్ ఆరోపించారు. రైతుల నుంచి తీసుకున్న భూములతో వ్యాపారం చేస్తున్నారని, మరోపక్క ఎకరానికి రూ 99లకు లీజుకి ఇస్తున్నారని చింతా మోహన్ విమర్శించారు. జగన్ గానీ ఇప్పుడు చంద్రబాబు గానీ ప్రజలను దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. అందుకే పేదవాళ్లుగా ఉండే వీళ్ళు కోట్లకు కోట్లు సంపాదించారని ఆయన అన్నారు. దేశంలో పేదవాళ్ళు కూటికి లేక అల్లాడిపోతుంటే పెట్టుబడిదారులు రోజురోజుకి మరింత సంపన్ను లు అవుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

# ఈవీఎం ఎమ్మెల్యే ఇసుక దోపిడీ

**ప్రజల ప్రాణాలతో చెలగాటం - కళ్ళు మూసుకున్న అధికార యంత్రాంగం - కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఈవీఎం ఎమ్మెల్యే**
**కోటిలింగాల పేట ఇసుక ర్యాంపుల రహదారిపై ధర్నా - సేవ్ మల్లయ్య పేట నినాదంతో స్థానికులతో కలిసి వైసిపి శ్రేణులతో మాజీ ఎంపీ భరత్ నిరసన**

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గోదావరి నది గర్భాన్ని తొలిచేస్తూ, గామన్ బ్రిడ్జి, ధవళేశ్వరం బ్యారేజ్ లకు ప్రమాదం కలిగే విధంగా నగర ఈవీఎం ఎమ్మెల్యే ఇసుక దోపిడీ చేస్తు, ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతూ లక్షలాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారని వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ భరత్ రామ్ తీవ్రంగా విమర్శించారు. కోటిలింగాల ఇసుక రాంపులకు సంబంధించి ఇసుక లారీలు రాకపోకలు సాగించే మల్లయ్య పేట పేపర్ మిల్లు టింబర్ డిపో వద్ద రహదారిపై స్థానికులు, వైసిపి శ్రేణులతో కలిసి మాజీ ఎంపీ భరత్ ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఇదేమి రాజ్యం దోపిడీ రాజ్యం, ఆదిరెడ్డి ఆరా చకాలు సిగ్గు, సిగ్గు, నగరంలో ఇసుక లోడు లారీలు నిషేధించాలి, సేవ్ మల్లయ్య పేట నినాదాలతో హోరెత్తిం చారు. కాతేరు, రాజమండ్రి ప్రధాన రహదారిపై ధర్నా వల్ల సుమారు గంట పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ, గోదావరి నదిలో బోటు మెన్లు సొసైటీల ముసుగులో డ్రగ్జింగ్ బోట్లతో ఇష్టానుసారం తవ్వి వందల లారీలతో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తూ ఈవీఎం ఎమ్మెల్యే అక్రమంగా సంపాది స్తున్నారని ఆరోపించారు. ఈవీఎం ఎమ్మెల్యేకు అన్నిట్లోనూ ధన దాహం ఎక్కువైందని నిత్యం కాసుల వర్షం కురుస్తుందని మండిపడ్డారు. గత రెండేళ్ల కాలంలోనూ మల్లయ్య పేట వాసులు దుమ్ము దూళితో ఊపిరితిత్తుల , చర్మ వ్యాధుల బారిన పడుతున్నారని, ఇసుక లోడు లారీల వల్ల ప్రమాదాల జరుగుతున్నాయని, అనేకమంది మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల సమస్యలను, ఇబ్బందులను పట్టించుకోకపోవడంతో స్థానికులు ఈరోజు రోడ్డు మీదకు వచ్చారని ఆయన అన్నారు. నిత్యం ఐదారువందల ఇసుక లోడు లారీలు తిరుగుతున్నాయని, లక్షల రూపాయలు సేనరేజీ రూపంలో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని ఆరోపించారు. కోటిలింగాలపేట ప్రాంతంలో నేను 15 ఇసుక ర్యాంపులు ఉన్నాయని, వాటిలో రెండుకి మాత్రమే అనుమతులు ఉన్నాయినీ మిగతా అన్ని




కూడా అక్రమంగా నడుస్తున్నాయని, రెవెన్యూ, మైన్స్ శాఖల అధికారులు కళ్ళు మూసుకున్నారని దుయ్యబట్టారు. పేరుకు ఉచిత ఇసుక అంటున్నారని అయితే వాస్తవంగా వేల రూపాయలకు అక్రమంగా అమ్ముకుంటున్నారని, ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. రాత్రులు ,పగలు తేడా లేకుండా డ్రగ్జింగ్ చేస్తున్నారని సమీప గామాన్ బ్రిడ్జికి ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గామన్ బ్రిడ్జికి అటు ఇటుగా రూరల్, అర్బన్ ఎమ్మెల్యేలు విభజించుకొని వీరిద్దరి అనుచరులు, మాజీ కార్పొరేటర్లు ఇసుకను అక్రమంగా దోచుకుంటున్నారని విమర్శించారు. నదీ గర్భం తొలిచేస్తూ పర్యావ రణానికి, ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన ఇసుక అక్రమ తవ్వకాలు, దోపిడీని అరికట్టాలని వానికి జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత మైన్స్ అధికారులకు మాజీ ఎంపీ భరత్ విజ్ఞప్తి చేశారు. వారం రోజుల వ్యవధిలో ఇసుక అక్రమ తవ్వకాలను, రవాణాలను నియంత్రించాలని లేదంటే తాను ప్రజల పక్షాన ఆందోళన ను ఉదృతం చేస్తామని, అవసరమైతే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆశ్రయిస్తానని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నగరంలో ఇసుక లారీలు రాకుండా అడ్డుకోవాలని పలువురు స్థానిక మహిళలు మాట్లాడారు.

# మెర్నిపాడు అభివృద్ధి ప్రదాతకు ఘన సత్కారం

**ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన సాగించిన సర్పంచ్**
**మెర్నిపాడు సర్పంచ్ గారపాటి సౌజన్య అశోక్ కుమార్ పదవి విరమణ అభినందన సభలో జననీరాజనం**



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం మెర్నిపాడు గ్రామ పంచాయితీ గడిచిన ఇరవై ఏళ్లగా ఎటువంటి అభివృద్ధి చెందలేదు. అలాంటి అభివృద్ధిని ఈ ఐదేళ్ల కాలంలో చూశామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ గ్రామ పంచాయతీ సర్పంచ్ గారపాటి సౌజన్య అశోక్ కుమార్ చేసిన సేవలను గుర్తు చేస్తూ బుధవారం గ్రామంలో సర్పంచ్ గారపాటి దంపతులను ఘనంగా సత్కరించారు. మెర్నిపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ గారపాటి సౌజన్య అశోక్ కుమార్ ప్రజల అభిమానంతో అభివృద్ధి పథంలో పరిపాలన చేసి పదవీ కాలం పూర్తి అయిన సందర్భంగా అభినందన సభ జరిగింది. మెర్నిపాడు గ్రామంలో జరిగిన సర్పంచ్ అభినందన సభలో గ్రామ ప్రజలు, ఎస్సీ, ఎస్టీ, ఓసి బిసి మైనారిటీల యువకులు, ప్రజలు హాజరయ్యారు.గ్రామాన్ని వరుసగా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వంచే పురస్కార అవార్డును అందుకునేలా చేసి, మంచితనానికి మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచి, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిన గారపాటి సౌజన్య అశోక్ కుమార్ లను గజమాలతో సత్కరించారు. వెలగతోడు నాయకులు ఈదల వీరాస్వామి మాట్లాడుతూ సర్పంచ్ గా పదవీ బాధ్యతలు చేపట్టినప్పుడు గారపాటి సౌజన్య అశోక్ లు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో మౌలిక వసతులను కల్పించడమే కాకుండా ఆ గ్రామానికి అవసరమైన బైపాస్ రోడ్డును నిర్మించారని కొనియాడారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయకుండా వారి వల్ల కాదని చేతులెత్తేసిన ఆ రోడ్డును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తో మాట్లాడి సుమారు రూ 30 లక్షల రూపాయలతో పూర్తి చేసి చూపించిన ఘనత సౌజన్య అశోక్ కుమార్లకు మాత్రమే దక్కుతుందని పేర్కొన్నారు.ఒక వార్డుకి రూ 30 లక్షల రూపాయలు గ్రామంలో మంజూరు చేయడమంటే చాలా అద్భుతమనీ వీరాస్వామి తెలిపారు. మండపేట నుంచి విచ్చేసిన వైసిపి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మెండు బాపిరాజు, జిల్లా వైసిపి పార్టీ ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, వైసిపి ఐటి వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, గంటి మోహన్ రావులు దుశ్శాలువా కప్పి జ్ఞాపిక తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దేవు ప్రసాద్ నాయుడు, తోరం శ్రీనివాస్, శెనగల శ్రీను, యనమదల ఆంజనేయులు, పంపన మణికంఠ, బోనగిరి గణేష్, బంగా వెంకన్న, జంగం ప్రవీణ్, చల్లా వినోద్, బుంగా ముసలయ్య (పండు), గొలిపాటి రాజేశ్, పెంటపాటి నగేశ్, కందాల బ్రదర్స్, యరమాటి సతీష్, షేక్ సర్దార్, గారపాటి ప్రవీణ్, ముత్యాల అరవింద్, వల్లూరి మురళీ కృష్ణ, గ్రామ పంచాయతీ సిబ్బంది, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# రాజమండ్రిలో పన్నుల వసూళ్లలో ఆర్ఎంసి రికార్డు

**ఒక్క రోజే రూ.5.12 కోట్లు వసూలు : కమిషనర్ రాహుల్ మీనా**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆస్తి పన్ను వసూళ్లలో ఆర్ఎంసి రికార్డు స్థాయి వసూళ్లు సాధించినట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి నగరవ్యాప్తంగా 82.41 శాతం పన్నులు వసూలైనట్లు వెల్లడించారు. చివరి రోజున మంగళవారం ఒక్కరోజే రూ. 5.12 కోట్ల వరకు వసూలైనట్లు తెలిపారు. గతేడాది రూ.75.24 కోట్లు వసూళ్లు కాగా.. ప్రస్తుత ఏడాది ఇప్పటి వరకు ఆస్తి, ఖాళీ స్థల పన్నులు రూ.78.72 కోట్లు., నీటి ఛార్జీల కింద రూ.10.78 కోట్లు వసూలు అయిందన్నారు. ప్రైవేట్ ఆస్తి(నివాస, వాణిజ్య) పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నట్లు పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళిక, రోజువారీ సమీక్షలు, లక్ష్యాలకు అనుగుణంగా శ్రమించడం వల్లనే రికార్డుస్థాయిలో ఆదాయం వచ్చిందన్నారు. అలాగే బకాయిల వసూళ్లలోనూ పురోగతి కనిపించిందన్నారు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం



బకాయిలపై 50 శాతం మేర వడ్డీ రాయితీ కల్పించడం కలిసివచ్చిందని కమిషనర్ అన్నారు. సకాలంలో పన్నులు చెల్లించిన ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పన్ను వసూళ్లలో కృషి చేసిన వార్డు సచివాలయాల కార్యదర్శులు, అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

నేలకోటలో పెద్ద పులి సంచారం

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఫారెస్ట్ అధికారులు

**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్ :** దేవీపట్నం మండలం, నెలకోట గ్రామానికి సంబందించిన రామదుర్గం కొండ పరిసర గ్రామాల్లో పెద్ద పులి సంచారం ఉన్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపియున్నారు. సీతానగరంమండలం,పురుషోత్తపట్నం ,నేలకోటకు ఆనుకొని ఉన్న ప్రాంతం కనుక పులి వచ్చుటకు అవకాశం ఉన్నందువలన రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం , రఘుదేవపురం మరియు మండలములోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, ఒంటరిగా తిరగొద్దని , జన సంచారం లేని ప్రాంతాలకు వెళ్ళవద్దని, సీతానగరం మండల పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని ఫారెస్ట్ అధికారులు తెలియజేసారు. రాత్రి సమయంలో బయటకు వెళ్లరాదు.అడవి /పొలాల వైపు ఒంటరిగా వెళ్లరాదు. పశువుల పాకల వద్ద తగిన వెలుతురు ఏర్పాటు చేసుకోవాలి పెద్ద పులి కనిపించినట్లయితే దగ్గరకు వెళ్లరాదు. వదంతులను నమ్మవద్దు. వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

# చిరస్మరణీయుడు పోతుల వీరభద్రరావు

**-వర్ధంత్యుత్సవంలో మంత్రి దుర్గేష్ తదితరుల నివాళి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విలువలతో కూడిన రాజకీయాలు చేసి, సాహిత్య, క్రీడా, సేవా రంగాల్లో తనదైన ముద్ర వేసి, అజాతశత్రువుగా పేరొందిన మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పోతుల వీరభద్రరావు చిరస్మరణీయుడని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తదితరులు పేర్కొన్నారు. వీరభద్రరావు 27వ వర్ధంత్యుత్సవం బుధవారం రాత్రి స్థానిక శ్రీ వీరేశలింగం పురమందిరం (టౌన్ హాలు)లో జరిగింది.మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటూ, స్వర్గీయ వీరభద్రరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీ పోతుల వీరభద్రరావు ట్రస్ట్ కార్యదర్శి, కోశాధికారి ఆకుల వీర్రాజు సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ బివిఎస్ మూర్తి అధ్యక్షత వహించగా సభను యాక్షన్ సంస్థ కో ఆర్డినేటర్ మేడా గురుదత్త ప్రసాద్ ప్రారంభించారు. టౌన్ హాలు ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు, మద్దూరి శివ సుబ్బారావు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, వైసిపి నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జగన్నాథం వెంకటరెడ్డి, రెడ్డి రాజు, బాక్స్ ప్రసాద్,తోట సుబ్బారావు, పివిఎస్ కృష్ణారావు, సుంకర నాగేంద్ర కిషోర్, డి నీలకంఠరావు, బెజవాడ రంగారావు, తదితరులు పోతుల వీరభద్రరావు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సాహిత్య రంగంలో పాత్రికేయుడు, రచయిత భమిడిపల్లి వీర రాఘవరావు, సేవారంగంలో పిచ్చుక వెంకట రాంబాబు, క్రీడా రంగంలో శీర గంగాధరరావులను పురస్కారాలతో మంత్రి దుర్గేష్ తదితరులు సత్కరించారు. రాకా కార్యదర్శి జివి రమణ, బెజవాడ రాజ్ కుమార్, మంచాల బాబ్జి, వివి సుబ్రహ్మణ్యం, విటివిసుబ్బారావు,రుక్మగదరావు, డిహెచ్ పి.శాస్త్రి, ముంగండి సూర్యనారాయణ, పలువురు ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


# పుష్కరాలు తరిమికొస్తున్న కానరాని కార్యాచరణ : యర్రా

**- 22 నెలల్లో సమర్థవంతమైన పాలన**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 22 నెలల్లోనూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సమర్థవంతంగా సిఎం చంద్రబాబు నాయుడు ముందుకు నడి పిస్తున్నారని, అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించేందుకు తీర్మానం చేయడం వల్ల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణు హర్షం వ్యక్తం చేసారు.స్థానిక వై-జంక్షన్లో ఉన్న ఆనం రోటరీ హాల్లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో యర్రా వేణు మాట్లాడుతూ ఆంధ్రులు గర్వంగా అమరావతి మా రాజధాని అని చెప్పుకునేలా తీర్చిదిద్దడం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ మద్ధతుతో ఈ చట్టబద్ధతకు ఆమోదం లభిస్తుందన్నారు. వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలకు ఇంకా 14 నెలలు మాత్రమే సమయం ఉందని అధికారులు శాశ్వత ప్రాతిపదిన నగరంలో అభివృద్ధి పనులు చేపట్టేలా అధికారులు కార్యాచరణ చేయడం లేదని విమర్శించారు. నగరంలో గాలి కాలుష్యం, నీటి కాలుష్యం అధికంగా ఉన్నాయని వాటి నిరోధానికి తీసుకుంటున్న చర్యలు కూడా శూన్యమన్నారు. అధికారులు ఇలాగే వ్యవహరిస్తున్న పుష్కరాల సమయంలో లక్షలాదిగా వచ్చే యాత్రీకులు ఇబ్బందులు పడతారన్నారు. గోదావరి పుష్కరాలకు వచ్చే నిధుల్లో కొంత కేటాయించి వాటర్ వర్క్సని వెంకట నగరం వద్దకు తరలించాలని, ఫిల్టరేషన్ పాయింట్ కూడా అక్కడే నిర్మాణం చేయాలని డిమాండ్ చేసారు. మాజీ కార్పొరేటర్లు,ప్రజా ప్రతినిధులు, మేధావులు, సీనియర్లు, విద్యావేత్తలతో అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరారు.

# విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్ :** విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ తగిలి వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన సీతానగరం మండలంలోని చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రాపురం గ్రామానికి చెందిన పిర్ల పోశయ్య (33)అనే వ్యక్తి మంగళవారం ఉదయం పశువులకు మేత కోసం పచ్చ గడ్డి తీసుకురావడానికి వీర్రాజు పంట పొలాల్లో గడ్డి కోసి తలపై గడ్డి మోపుతో పంట కాలువ గట్టుపై నడుచుకుంటూ వస్తుండగా తలపై ఉన్న గడ్డిమోపు ట్రాన్స్ఫార్మర్ కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం బుధవారం తెలియడంతో సంఘటన స్థలానికి సీతానగరం ఎస్సై బి.వినయ్ ప్రతాప్ చేరుకుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# చింతాలమ్మ జాతర మహోత్సవంలో పాల్గొన్న జక్కంపూడి విజయలక్ష్మి

**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామ దేవత చింతాలమ్మ జాతర మహోత్సవం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజ యలక్ష్మి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెకు స్వాగతం పలికారు.



# చింతాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న నీరు కొండ వీరన్న చౌదరి



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామ దేవత చింతాలమ్మ సిరి జాతర కార్యక్రమానికి రాజానగరం నియోజకవర్గం బిజెపి కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి అమ్మవారిని దర్శించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. వీరిని కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు.

# ఆటో చోరీ కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష

**రూరల్ సిఐ దొరరాజు**



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆటో చోరీ కేసులో మూడేళ్ల జైలు శిక్ష పడిందని రూరల్ సిఐ దొరరాజు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.మండపేట మండలం జెడ్. మేడపాడు గ్రామానికి చెందిన బీమన వెంకటరమణ ప్యాసింజర్ ఆటోను గత ఏడాది మార్చి 3 ఇంటి ముందు పార్క్ చేశారు. ఉదయం ఆటో కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.విచారణ చేపట్టారు. తాడేపల్లిగూడెం మామిడి తోటకు చెందిన మొలగల వెంకటేశ్వరరావును నిందితుడిగా గుర్తించారు. ఈ కేసును విచారించిన ఆలమూరు కోర్టు న్యాయమూర్తి ఐ.ప్రవీణ్ కుమార్ నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000/- జరిమానా విధించారు. జరిమానా చెల్లించనట్లయితే అదనంగా 3 నెలల జైలు శిక్ష విధించారు.ఈ కేసులో ఏపీపీ విల్లా శ్రీరాములు వాదనలు వినిపించగా, కోర్ట్ కానిస్టేబుల్ డి.వి.రమణ సాక్ష్యులను ప్రవేశపెట్టారు.



# అందుకే నాకు స్టార్‌డమ్ రాలేదు..

## ఆసక్తికర విషయాలు తెలిపిన హీరో రాజశేఖర్



శర్వానంద్, అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన హై-ఆక్టేన్ రేసింగ్ డ్రామా 'బైకర్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ అడ్వంచరస్ చిత్రంగా రూపొందుతున్న బైకర్ డాల్బీ సినిమా, EPIQ, 4DX, PCX వంటి ప్రీమియం ఫార్మాట్లలో విడుదల కానుంది. నటుడు రాజశేఖర్ తన సుదీర్ఘ సినీ ప్రయాణం, రాబోయే చిత్రం బైకర్ గురించి ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన కెరీర్‌లో మగాడు, అల్లరిప్రియుడు, గరుడవేగ, సింహరాశి, గోరింటాకు వంటి అనేక విజయవంతమైన చిత్రాలు ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. మగాడు 2 పేరుతో రాబోతున్న చిత్రం నిజానికి మగాడు సినిమాకు సీక్వెల్ కాదని, ఆ టైటిల్ తమకు ఇష్టపడి పెట్టుకున్నదే అని స్పష్టం చేశారు. అలాగే, అల్లరిప్రియుడు వంటి సీక్వెల్స్ చేయాలనుకోవడం లేదని, తన వయసుకు తగ్గ పాత్రలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నానని తెలిపారు రాజశేఖర్. అయితే, తాను ప్రస్తుతం నటిస్తున్న యాక్సిడెంట్ సినిమాను తన కుమార్తె శివాని అల్లరిప్రియుడు పార్ట్ 2 లాంటి సరదా చిత్రంగా అభివర్ణించిందని పేర్కొన్నారు రాజశేఖర్. తాను నటించిన బైకర్ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యున్నత ప్రమాణాలతో నిర్మిస్తున్నాయని రాజశేఖర్ ప్రశంసించారు. నిర్మాణ సంస్థ ధైర్యం, రాజీ పడని నిర్మాణ విలువలు అభినందనీయమని కొనియాడారు రాజశేఖర్. యూవీ క్రియేషన్స్ అధినేతలు ఇచ్చిన నంబర్ వన్ రాయల్ ట్రీట్మెంట్ గురించి మాట్లాడారు. ఈ చిత్రంలో శర్వానంద్ సరసన రాజశేఖర్ బుల్లెట్ సునీల్ అనే కీలక పాత్రను పోషిస్తున్నారు. తన కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని, ప్రేక్షకులు సింహరాశి, గోరింటాకు వంటి చిత్రాలను గుర్తు చేసుకుంటూ తనను ప్రోత్సహించడం సంతోషంగా ఉందని చెప్పారు. స్టార్‌డమ్ లభించకపోవడానికి గల కారణాలను విలేఖరి ప్రశ్నించగా, తాను ఎప్పుడూ స్టార్‌డమ్, హోదా కోసం సినిమాలు చేయలేదని రాజశేఖర్ వివరించారు. "నెక్స్ట్ సబ్జెక్టు ఏంటి? ఈ సబ్జెక్టు బాగుందే, మనం చేసి ఉంటే బాగుండేది" అన్న కోణంలోనే తన పాత్రలను ఎంచుకున్నానని తెలిపారు. బైకర్ తో పాటు తాను ప్రస్తుతం నటిస్తున్న అన్ని చిత్రాలలో సబ్జెక్టే హీరో అనే సిద్ధాంతాన్ని తాను అనుసరిస్తున్నానని వెల్లడించారు. ఈ విధానం వల్లనే తనకు ఎక్కువ విజయం వచ్చిందని భావిస్తున్నానని అన్నారు. తన భార్య జీవిత, కుమార్తెలు శివాని రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ సినీ రంగంలో తమదైన గుర్తింపు సంపాదించుకుంటున్నారని, వారి విజయం పట్ల తాను గర్వపడుతున్నానని రాజశేఖర్ పేర్కొన్నారు. బైకర్ చిత్రం నుండి మళ్లీ తన స్టార్‌డమ్ ప్రారంభంకావాలని ఆకాంక్షించారు. బైకర్ ఏప్రిల్ 3న విడుదలవుతుందని, కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్లలో చూడమని ఆయన ప్రేక్షకులను కోరారు.

# దట్ ఈజ్ నయనతార..!

## ఐదు భాషల్లో ఫుల్ బిజీగా ఉన్న లేడీ సూపర్ స్టార్



నయనతార.. ఈ స్టార్ హీరోయిన్ కు లేడీ సూపర్ స్టార్ అనే బిరుదు ఉంది. బాలీవుడ్‌లోనూ ఈ బ్యూటీకిడిమాండ్ పెరిగింది. షారుఖ్ 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది ఈ అమ్మడు. తొలి సినిమాతోనే బాలీవుడ్‌లో మంచి పేరు తెచ్చుకుంది . 'అయ్యా' ఆమె తొలి తమిళ చిత్రం. 2011లో 'శ్రీరామరాజ్యం' సినిమాలో ఆమె నటనకుగాను ఫిలింఫేర్ అవార్డు ఆడుకుంది. 2011కి ముందు నయనతార క్రిస్టియన్. 2011లో క్రిస్టియన్ మతాన్ని విడిచిపెట్టి హిందూ మతాన్ని స్వీకరించింది. నయనతార 2022లో దర్శకుడు విఘ్నేష్ శివన్‌ని పెళ్లాడింది. నయనతార అసలు పేరు దయానా మరియం కురియన్. 2003లో 'మనసీనక్కరే' అనే మలయాళ చిత్రంతో సినీ ప్రయాణం మొదలుపెట్టింది. మలయాళంలో కొన్ని సినిమాలు చేసిన తర్వాత తెలుగు, తమిళ చిత్రాల వైపు అడుగులేసింది. 'అయ్యా' ఆమె తొలి తమిళ చిత్రం. 2011లో 'శ్రీరామరాజ్యం' సినిమాలో ఆమె నటనకుగాను ఫిలింఫేర్ అవార్డు ఆడుకుంది. 2011కి ముందు నయనతార క్రిస్టియన్. 2011లో క్రిస్టియన్ మతాన్ని విడిచిపెట్టి హిందూ మతాన్ని స్వీకరించింది. నయనతార 2022లో దర్శకుడు విఘ్నేష్ శివన్‌ని పెళ్లాడింది. ఆ తర్వాత సరోగసీ ద్వారా ఇద్దరు తల్లిదండ్రులు అయ్యారు. వీరికి కవలలు. ప్రస్తుతం సౌత్ లో అత్యంత రెమ్యునరేషన్ తీసుకుంటుంది నయనతార. ఒక్కో సినిమాకు 20 నుంచి 25 కోట్ల రూపాయలు వసూల్ చేస్తుంది. రీసెంట్ డేస్ లో నయన్ సినిమాల స్పీడ్ పెంచేసింది. తెలుగు  తమిళ్, హిందీ సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది ఈ చిన్నది. అలాగే మలయాళంలోనూ సినిమాలు చేస్తుంది. ఇప్పటికే రెండు సినిమాలను లైనప్ చేసింది. ఇక ఇప్పుడు కన్నడ భాషలోనూ నటిస్తుంది. ఇలా ఐదు భాషల్లో నటిస్తూ యమా బిజీగా ఉంది ఈ అందాల తార.

# బ్యాటా ? దుడ్డు కర్రా ?

## గుజరాత్ బ్యాటర్ బ్యాట్‌ని స్కేలుతో కొలిచిన అంపైర్.. తర్వాత ఏమైందంటే..?

ఐపీఎల్ 2026లో భాగంగా మొన్న మంగళవారం (మార్చి 31) పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన మ్యాచ్ క్రికెట్ అభిమానులకు సరికొత్త వినోదాన్ని పంచింది. ముల్లాన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ పోరులో పంజాబ్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపులో హీరోగా నిలిచిన కూపర్ కోనోలీ (72 నాటౌట్) గురించి ఒకవైపు చర్చ జరుగుతుంటే, మరోవైపు గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ రాహుల్ తెవాటియా బ్యాట్ విషయంలో జరిగిన ఒక ఆసక్తికర సంఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది.





### ఏం జరిగిందంటే?

గుజరాత్ టైటాన్స్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో వాషింగ్టన్ సుందర్ అవుట్ అయిన తర్వాత రాహుల్ తెవాటియా క్రీజులోకి వచ్చాడు. అతను ఇంకా స్ట్రైక్ కూడా తీసుకోలేదు, అప్పుడే ఆన్-ఫీల్డ్ అంపైర్లు అతని దగ్గరికి వెళ్లి బ్యాట్‌ను తనిఖీ చేశారు. బ్యాట్ గేజ్ టెస్ట్ నిర్వహించగా, తెవాటియా బ్యాట్ ఆ పరీక్షలో ఫెయిల్ అయింది. అంటే ఉండాల్సిన పరిమాణం కంటే ఆ బ్యాట్ లావుగా ఉందని అంపైర్లు గుర్తించారు. దీంతో తెవాటియా తన బ్యాట్‌ను మార్చుకోవాల్సి వచ్చింది. లైవ్ మ్యాచ్‌లో ఇలా బ్యాట్ చెక్ చేసి మార్పించడం చూసి అభిమానులు ఆశ్చర్యపోయారు.

### ఏమిటీ బ్యాట్ గేజ్ నియమం?

క్రికెట్ బ్యాట్ ఇష్టమొచ్చినట్టు ఉండకూడదని, దానికి కొన్ని కొలతలు ఉండాలని ఎంసీసీ చట్టం 5 స్పష్టం చేస్తోంది. 2025 ఐపీఎల్ సీజన్ నుంచి ఈ నిబంధనను మరింత కఠినతరం చేశారు.

**అంచుల మందం:** బ్యాట్ అంచులు 4 సెంటీమీటర్ల (1.56 అంగుళాలు) కంటే ఎక్కువ ఉండకూడదు.

**బ్యాట్ లోతు :** గరిష్టంగా 6.7 సెంటీమీటర్లు (2.64 అంగుళాలు) మాత్రమే ఉండాలి.

**వెడల్పు:** బ్యాట్ వెడల్పు 10.8 సెంటీమీటర్ల (4.25 అంగుళాలు) లోపు ఉండాలి.

ఈ కొలతల కంటే ఒక్క మిల్లీమీటర్ ఎక్కువ ఉన్నా అంపైర్లు ఆ బ్యాట్‌ను అనుమతించరు. మైదానంలోకి వెళ్లే ప్రతి బ్యాట్‌ను ఫోర్త్ అంపైర్ చెక్ చేస్తారు. ఒకవేళ మైదానంలో బ్యాట్ మార్చాల్సి వస్తే ఆన్-ఫీల్డ్ అంపైర్లు చెక్ చేస్తారు.

### అనిల్ చౌదరి ఏమన్నారంటే?

ఈ వ్యవహారంపై మాజీ అంపైర్ అనిల్ చౌదరి స్పందించారు. "గతంలో చాలామంది బ్యాటర్లు నిబంధనలకు విరుద్ధంగా భారీ సైజు బ్యాట్లను వాడేవారు. దీనివల్ల బౌలర్లకు అన్యాయం జరుగుతుందని భావించి 2025లో ఈ కఠిన నిబంధనను అమల్లోకి తెచ్చారు. ఇప్పుడు ఐపీఎల్ ప్లేయింగ్ కండిషన్స్‌లో భాగంగా ప్రతి బ్యాట్ టెస్ట్ పాస్ కావాల్సిందే. సాధారణంగా ఇవి డ్రెస్సింగ్ రూమ్ నుంచి వచ్చే ముందే తనిఖీ చేస్తారు, కానీ తెవాటియా విషయంలో అది ఆన్-ఫీల్డ్ లో జరగడం విశేషం" అని ఆయన వివరించారు.

### మ్యాచ్ ఫలితం సంగతేంటి?

రాహుల్ తెవాటియా బ్యాట్ మారినా, పంజాబ్ కింగ్స్ జోరు మాత్రం తగ్గలేదు. గుజరాత్ నిర్దేశించిన 163 పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ 19.1 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యువ ఆటగాడు కూపర్ కోనోలీ తన అద్భుత బ్యాటింగ్‌తో జట్టును గట్టెక్కించాడు. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినా, ఆఖరి ఓవర్లలో పంజాబ్ బ్యాటర్ల ధాటికి తలవంచక తప్పలేదు. ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మెరుగుపరుచుకుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com